
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States



CORPORATE COMMERCE™
College for Practical Exposure
MEC / CEC
B.Com / BBA
Coming soon @ Ameerpet
Beside Sarathi Studios

CA. China Masthan T
www.corporatecommerce.in
94188 66666



సంపుటి : 23 | సంచిక : 285 | ది. 21-1-2025 | విజయవాడ | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


## మళ్లీ జన్మ ఉంటే తెలుగుబిడ్డగానే పుడతా

- తెలుగుజాతిలో పుట్టడం అదృష్టంగా భావిస్తున్నా
- ఉద్యోగాలు చేయడం కాదు... ఇచ్చే స్థాయికి మనవాళ్లు ఎదగాలి
- రాష్ట్రాభివృద్ధిలో ఎన్ఆర్ఐల భాగస్వామ్యం అవసరం
- వర్క్‌ఫ్రం హెూం హబ్‌గా ఏపీని మార్చుతాం
- జ్యూరిచ్‌లో తెలుగు పారిశ్రామిక వేత్తల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు





**జ్యూరిచ్/స్విడ్జర్లాండ్, జనవరి 20 (వార్తాప్రభ) :** 'నిత్య స్ఫూర్తి నిచ్చే తెలుగు జాతిలో పుట్టడం నా అదృష్టంగా భావిస్తున్నా. మళ్లీ జన్మంటూ ఉంటే తెలుగుబిడ్డగానే పుడతా. నేనెక్కడున్నా నా మనసు తెలుగు జాతి కోసమే తపనపడుతుంది' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్లిన సీఎం చంద్రబాబు నాయుడు జ్యూరిచ్‌లో తెలుగు కమ్యూనిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్‌లో పాల్గొన్నారు. అనంతరం వారిని ఉద్దేశించి ప్రసంగించారు.

**మనవాళ్లకే అవకాశాలెక్కువ..** 'రాజకీయాల్లోకి వచ్చేందుకు యువతను ఎక్కువగా ప్రోత్సహించా. ఏ దేశమైనా యువత వల్లే అభివృద్ధి చెందుతుంది. యూరప్ లోని 12 దేశాల నుంచి ఈ సమావేశానికి మీరంతా వచ్చారు. గతంలో నేను ఇక్కడి ఎయిర్ పోర్టుకు వస్తే ఎవరూ ఉండేవారు కాదు. ఒకప్పుడు యూరప్‌లో తెలుగువారు ఉండేవారు కాదు. మన వాళ్లు చాలా తెలివైన వాళ్లు... ఎక్కడ అవకాశాలు అంటే అక్కడికి వెళ్తారు. ఊహించని అవకాశాలు భారతీయులకు వస్తాయి... అందులో తెలుగువారు అగ్రస్థానంలో ఉంటారు. యూరప్ మొత్తం వయసు సమస్యతో ఇబ్బంది పడుతోంది. ప్రపంచంలో మన వాళ్లకు ఎక్కువ అవకాశాలు వస్తున్నాయి. ప్రపంచంలో ఎన్నిదేశాలు ఉన్నాయో అన్ని చోట్ల భారతీయులు, తెలుగువారి ఆనవాళ్లు తప్పకుండా ఉంటున్నాయి.' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**నా కోసం మీరు చేసిన పోరాటం మర్చిపోలేను..** 'ఇన్ని దేశాల్లో తెలుగువారు ఉంటారని నా జీవితంలో ఊహించలేదు. అవకాశాలు అందిపుచ్చుకుని విదేశాలకు వచ్చారు. నన్ను జైలుకు పంపిన సమయంలో మీరు పోరాడిన తీరు నేను చూశాను... ఇన్ని దేశాల్లో తెలుగువారు ఉన్నారా అనిపించింది. 53 రోజుల పాటు నా కోసం మీ-రు ఉద్యమం చేశారు. రాజకీయాల్లో ఉండటానికి అర్హత లేని వ్యక్తి అధికారంలో ఉంటే ఏమైందో గత ఐదేళ్లు చూశాం. రాష్ట్రాన్ని గట్టెక్కించడానికి టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేశాయి. ఎన్నికల సమయంలో ప్రపంచంలో ఎక్కడున్నా వచ్చి ఓట్లు వేసి మమ్మల్ని గెలిపించారు. ఇది నా జీవితంలో మర్చిపోలేను. పౌరులను తయారు చేయడంలో గతంలో చాలా మంది నాయకులు బాధ్యత తీసుకున్నారు.

సింగపూర్ ఒక మత్స్య గ్రామం... అలాంటి దేశాన్ని పబ్లిక్ పాలసీలతో అడ్వాన్స్ దేశంగా పాలకులు మార్చారు. ఏపీ అంటే వ్యవసాయం అని మాత్రమే అనుకున్నారు. 1991లో ఆర్థిక సంస్కరణలు వచ్చాయి. 1993లో ఇంటర్నెట్ రెవల్యూషన్ వచ్చింది. 1995లో నేను ముఖ్యమంత్రి అయ్యాను. ఆ సమయంలో ఎవరూ చేయని సాహసం చేశాను. రెండవ తరంలో సంస్కరణలు ప్రారంభించి ఐటీకి ప్రాధాన్యం ఇచ్చా. ఎవరికీ తెలియని సమయంలో ఐటీ గురించి మాట్లాడాను. పిల్లల్ని చదివిస్తే కోట్లు సంపాదిస్తారని చెప్పాను. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడం వల్ల తెలంగాణ ప్రజల తలసరి ఆదాయం దేశంలో అందరికంటే ఎక్కువ ఉంది. దీనికి కారణం నాడు నేను వేసిన పునాది.

**ఉద్యోగాలిచ్చే స్థాయికి తెలుగుజాతి ఎదగాలి..** 'మనవాళ్లు ఉద్యోగాలు చేయడం కాదు... ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఎప్పుడూ చెప్పేవాణ్ని. రెండవ తరంలో ఎంట్రప్రెన్యూర్‌కు ఆనాడు పునాది వేశానని గర్వంగా చెప్తున్నా. ఆడపిల్లలను చదివించాలని, వివక్ష చూపించొద్దని చెప్పా. కాలేజీ సీట్లలో, ఉద్యోగాల్లో 33 శాతం ఆడబిడ్డలకు రిజర్వేషన్లు పెట్టాను. ఏ ఐటీ కంపెనీకి వెళ్లినా ఇప్పుడు అమ్మాయిలు ఎక్కువగా కనబడుతున్నారు. ఇప్పుడు అన్ని దేశాల్లో జనాభా సమస్య వచ్చింది. జపాన్ లాంటి దేశం ఇండియా నుంచి మ్యాన్ పవర్ కావాలని మొదటిసారి అడుగుతోంది. సరైన సమయంలో నిర్ణయం తీసుకోకపోతే సంపద సృష్టించినా, టెక్నాలజీ ఉన్నా ఎవరు అనుభవిస్తారు.? 2047 నాటికి భారత్ ఆర్థికంగా ప్రపంచంలో మొదటి, రెండవ స్థానాల్లో ఉంటాం. 2 కోట్ల మంది తెలుగువాళ్లు ప్రపంచ దేశాలకు వెళ్తే దున్నేస్తారు. మీరు ఇక్కడే ఉండండి... మరింత విస్తరించండి. అభివృద్ధి చేయాలంటే దగ్గరే ఉండాల్సిన పనిలేదు... ఫోన్ ద్వారా కూడా అవుతుంది. తెలుగువారు ప్రపంచమంతా ఉండాలి.... కర్మభూమిని పట్టించుకోవాలి... జన్మభూమికి అవకాశాలు కల్పించాలి. ఈ రెండింటినీ సమాంతరంగా తీసుకెళ్లాలి.' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

**వర్క్‌ఫ్రం హెూమ్ హబ్‌గా ఏపీ..** 'ఎవరు ఏ రంగంలో రాణించాలన్నా ఆర్థికంగా ఇబ్బందులు ఉండకూడదు. రాజకీయాల్లో ఉండి డబ్బులు సంపాదిస్తే ఎప్పటికీ గౌరవం రాదు. కుటుంబం రాజకీయాలపై ఆధారపడకూడదని ఒకటి రెండుసార్లు విఫలం అయినా హెరిటేజ్ స్థాపించి గౌరవంగా ఉన్నాం. నేను రాజకీయం చేస్తే నా సతీమణి వ్యాపారం చూస్తుంది. లోకేష్ కూడా రాజకీయాలు చేస్తుంటే బ్రాహ్మణి వ్యాపారాలు చూస్తున్నారు. సంపద సృష్టించడం కష్టం కాదు. 2047 నాటికి నెంబర్ గా తెలుగుజాతి ఉండాలనేదే నా సంకల్పం. వ్యవసాయం, కూలీ కుటుంబాల నుంచి వచ్చాం. ప్రపంచలో ఎక్కడికెళ్లినా రాణిస్తున్నాం. ఉక్రెయిన్‌లో యుద్ధం ప్రకటిస్తే ఏం చేయాలో ఆలోచించి మన వాళ్లను కాపాడుకోగలిగాం. మనం వచ్చిన మార్గాన్ని ఎప్పుడూ

- 8లో

## ఢిల్లీ పెద్దలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న రేవంత్



**తెలంగాణ,జనవరి 20 (వార్తాప్రభ) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ అధిష్టానానికి చెడిందా? ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు మైలేజీ పొందలేక, పదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉన్న స్థితి నుంచి సొంతంగా పగ్గాలు చేపట్టే వరకు చేరిన హస్తం పార్టీ ఇప్పుడు తెలంగాణలో ఒకింత ఇబ్బందికరమైన పరిణామాలు ఎదుర్కుంటోందా? సీఎం రేవంత్ కు ఢిల్లీ పెద్దలకు గ్యాప్ విషయంలో రాష్ట్ర మంత్రులు కూడా తమ వంతు పాత్ర పోషిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఢిల్లీలో రాష్ట్ర మంత్రుల ప్రత్యేక సమావేశాల తర్వాత ఒకింత ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన అంశాలు దీనికి ఆజ్యం పోస్తున్నాయి. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం ఇటీవల జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఈ కార్యక్రమం సీఎం రేవంత్ పాలనపై మంత్రులే ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ కు ఫిర్యాదు చేసే వరకు వెళ్లిందని సమాచారం. పేరుకు పార్టీ కార్యక్రమం అయినప్పటికీ కేసీతో ప్రత్యేకంగా సమావేశమైన తెలంగాణ మంత్రులు, ముఖ్యనేతలు ఈ సందర్భంగా ఒకింత రేవంత్ రెడ్డిపై ఫిర్యాదు చేశారట. రాజకీయపరమైన అంశాలే కాకుండా పరిపాలనలో కీలకమైన బిల్లుల చెల్లింపు విషయంలో తమకు ఎదురవుతున్న సమస్యల గురించి కేసీ వేణుగోపాల్ వద్ద వాపోయారట. కొన్ని శాఖల బిల్లులు క్లియర్ అవుతున్నప్పటికీ..పలు శాఖల్లో మాత్రం బిల్లులు పెండింగ్‌లో ఉండటం తమకు అవమానంగా ఉందని ఒకింత కంప్లైంట్ రూపంలో చేరవేశారని సమాచారం. బిల్లుల చెల్లింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫిర్యాదు చేయడంతో పాటుగా సీఎం రేవంత్ వ్యవహారశైలిని కూడా ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారట. ఆర్థిక శాఖ మంత్రికి స్వేచ్ఛ ఉంది కాబట్టి బిల్లులు ఆయన్నే అడగాలంటూ సీఎం సమాధానం దాటవేస్తున్నారని, అయితే ఫైనాన్స్ మినిస్టర్ మాత్రం.. ఖజానాలో నిధులు లేవని, సీఎం గారు ఆర్థిక పరమైన అంశాల్లో పరిశీలన తర్వాతే నిర్ణయం అంటూ తమతో వెల్లడిస్తున్నారని దీంతో.. తమ పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి లాగా తయారైందని మంత్రులు వాపోయినట్లు సమాచారం. సాక్షాత్తు మంత్రులే బిల్లుల చెల్లింపు ఆలస్యం పట్ల తాము ఎదుర్కుంటున్న ఇబ్బందులను ఏకరువు పెట్టడంపై కేసీ వేణుగోపాల్ ఒకింత షాక్ అయినట్లు సమాచారం. కొన్ని శాఖలకు బిల్లులు క్లియర్ చేసి పలు శాఖల బిల్లులు పెండింగ్‌లో పెట్టడం సరికాదని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. గతంలో కర్ణాటకలో ఇదే రకమైన సమస్య ఎదురైనప్పుడు అన్ని శాఖలకూ నెలవారి కొంత మొత్తం కేటాయించాలనే ప్రతిపాదన తాము చేశామని.. అదే విషయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రికి కూడా వెల్లడిస్తామని కేసీ హామీ ఇచ్చినట్లు సమాచారం.

## వైసీపీకి బ్రహ్మాస్త్రం దొరికినట్లేనా ? ఇక జగన్ అల్లుకు పోతారా ..!



**అమరావతి, జనవరి 20 (వార్తాప్రభ) :** 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలు ఏపీ రాజకీయాల్ని సమూలంగా మార్చేశాయి. అప్పటివరకూ దుర్భేద్యంగా కనిపించిన వైసీపీ కాస్తా 11 సీట్లతో దారుణ పరాజయాన్ని చవిచూడగా.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏకంగా 164 సీట్లు గెల్చుకుని చరిత్ర సృష్టించింది. ఆ తర్వాత గత ఆరు నెలల్లో రాజకీయంగా నిలదొక్కుకునేందుకు జగన్ ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. ఇలాంటి సమయంలో కూటమే ఇప్పుడు జగన్ కు మంచి అస్త్రం ఇచ్చింది. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలు ఏపీ రాజకీయాల్ని సమూలంగా మార్చేశాయి. అప్పటివరకూ దుర్భేద్యంగా కనిపించిన వైసీపీ కాస్తా 11 సీట్లతో దారుణ పరాజయాన్ని చవిచూడగా.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏకంగా 164 సీట్లు గెల్చుకుని చరిత్ర సృష్టించింది. ఆ తర్వాత గత ఆరు నెలల్లో రాజకీయంగా నిలదొక్కుకునేందుకు జగన్ ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. ఇలాంటి సమయంలో కూటమే ఇప్పుడు జగన్ కు మంచి అస్త్రం ఇచ్చింది. పవన్ కళ్యాణ్ కు పోటీగా లోకేష్ ను చంద్రబాబు డిప్యూటీ సీఎం చేస్తారా లేదా అన్న చర్చను పక్కనబెడితే అసలు ఈ చర్చ తెరపైకి రావడం వైసీపీకి ప్లస్ అన్న వాదన మొదలైంది. కూటమి అధికారంలోకి వచ్చి ఆరునెలలవుతున్నా ఎలాంటి విభేదాలు లేకుండా పక్కా సమన్వయంతో మందుకు సాగిపోతోంది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ కారణంగా కూటమికి బీటలు వస్తాయని అంచనాలు వేసిన వైసీపీకి ఇప్పుడు ఆ అవసరం లేకుండా టీడీపీయే ఆ పని చేస్తోందన్న భావన మొదలైంది. లోకేష్ కు డిప్యూటీ సీఎంగా బాధ్యతలు కట్టబెట్టాలన్నా పవన్ కళ్యాణ్ అభిప్రాయం తీసుకోవడం చంద్రబాబుకు తప్పనిసరి. అయితే ఇప్పటికే పవన్ కు ప్రోటోకాల్ విషయంలో అన్ని విధాలుగా గౌరవిస్తున్న ప్రభుత్వం.. ఇప్పుడు తనకు పోటీగా లోకేష్ కు కూడా డిప్యూటీ సీఎం ఇస్తామని ప్రతిపాదిస్తే ఆయన ఎలా రియాక్ట్ అవుతారన్నది చూడాల్సి ఉంది. ముఖ్యంగా ఏ క్యాడర్, లీడర్ల పేరు చెప్పి లోకేష్ ను డిప్యూటీ చేస్తామని టీడీపీ ప్రతిపాదిస్తుందో అదే లీడర్ల పేరు చెప్పి పవన్ వ్యతిరేకించే అవకాశాలు లేకపోలేదు. అదే జరిగితే కూటమికి బీటలు మొదలైనట్లే అని వైసీపీ అంచనా వేసుకుంటోంది.

## రాష్ట్రమంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

- మెగా జాబ్ మేళాకు అపూర్వ స్పందన
- ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం






**ఏలూరు/ఆగిరిపల్లి,జనవరి 20 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో రానున్న ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. సోమవారం నూజివీడు నియోజకవర్గ పరిధిలోని యువతి యువకులకు అమరరాజా కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆగిరిపల్లి సమీపంలోని గోపాలపురం ఎన్ ఆర్ ఐ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను జ్యోతి ప్రజ్వలన చేసి రాష్ట్ర మంత్రి పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వద్దకే వచ్చి ప్రముఖ సంస్థలు, కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించే జాబ్ మేళా ఒక గొప్ప అవకాశమని, దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీ పై ఎన్నో ఆశలు పెట్టుకొని చదివించిన తల్లిదండ్రులకు, ఎంతో కష్టపడి మీరు చదివిన చదువుకు తగిన జాబ్ లభించినప్పుడే విద్యార్థులకు, తల్లిదండ్రులకు మరింత గౌరవం, తృప్తి కలుగుతుందని పేర్కొన్నారు. చదువు పూర్తయిన అనంతరం ఉద్యోగాల కోసం కంపెనీల చుట్టూ తిరిగే అవసరం లేకుండా కళాశాలల్లోనే జాబ్ మేళాలు నిర్వహించి పలు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించేలా కృషిచేస్తున్నమన్నారు. ఈ సువర్ణ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో అనేక మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ వస్తుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, అభివృద్ధి పనుల ఫలితంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద పెద్ద సంస్థలు ముందుకొస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో అనువైన పరిస్థితులు ఉండటం,రాష్ట్ర మంత్రి నారా లోకేష్ చొరవతో పెద్ద ఎత్తున వివిధ రకాల పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని, లక్షలాది మందికి వాటిల్లో ఉద్యోగ అవకాశాలు లభించునున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వెంకటరావు,ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీవారి భక్తులకు మసాలా వడలు... అన్నప్రసాదం మెనూలో మరో ఐటమ్

- టీటీడీ బోర్డు నిర్ణయం
- నేడు ట్రయల్ రన్... 5 వేల వడలు వడ్డింపు
- త్వరలోనే పూర్తిస్థాయి మెనూ



**తిరుపతి,జనవరి 20 (వార్తాప్రభ) :** శ్రీవారి భక్తులకు మరింత రుచికరంగా అన్నప్రసాదాలు అందించాలని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి నిర్ణయించింది. అన్నప్రసాదం మెనూలో అదనంగా మరో ఐటమ్ పెంచాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో, మెనూలో మార్పులు చేశారు. కొత్తగా మసాలా వడలు వడ్డించాలని నిర్ణయించారు. ట్రయల్ రన్ లో భాగంగా నేడు ఐదు వేల మసాలా వడలను భక్తులకు వడ్డించారు. ఉల్లి, వెల్లుల్లి లేకుండానే ఈ మసాలా వడలు తయారు చేశారు. కాగా, కొన్ని రోజుల పాటు పరిశీలించి, లోటుపాట్లను సవరించుకుని పూర్తి స్థాయిలో మెనూకి రూపకల్పన చేయనునున్నారు. ఈ మేరకు టీటీడీ కసరత్తులు చేస్తోంది. త్వరలోనే వడలతో కూడిన కొత్త మెనూను టీటీడీ చైర్మన్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

## త్వరలో వాట్సాప్ ద్వారా జనన, మరణ ధృవీకరణ పత్రాలు

- డేటా ఇంటిగ్రేషన్ సహా సాంకేతిక సవాళ్లను పరిశీలించండి
- దీని ఫలితాలను బట్టి త్వరలో రాష్ట్ర వ్యాపంగా అమలు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్
- వాట్సాప్ గవర్నెన్స్, ఏపీ సీఆర్ఎస్ అమలుపై ఆర్టీజీఎస్‌లో సమీక్ష
- ముందుగా తెనాలీలో ప్రయోగాత్మక పరిశీలన



**అమరావతి,జనవరి 20 (వార్తాప్రభ) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందించనుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తెలిపారు. ఇందులో భాగంగా వాట్సాప్ ద్వారా ప్రజలకు త్వరలోనే జనన, మరణ ధృవీకరణ పత్రాలు పొందే సదుపాయం కూడా కల్పిస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన కసరత్తులో భాగంగా ఈ నెలలోనే తెనాలీలో ప్రయోగాత్మకంగా ఈ ప్రక్రియను పరిశీలించనున్నట్లు వెల్లడించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు జనన, మరణ ధృవీకరణ పత్రాలు పొందే సేవలు కల్పించే ప్రక్రియపైన సోమవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు పౌరులకు మరింత సులభతరం చేయాలనే సదాశయంతో ముఖ్యమంత్రి వాట్సాప్ గవర్నెన్స్ సదుపాయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించారన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన ఆర్టీజీఎస్ అధికారులను సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్‌లో భాగంగా జనన మరణ ధృవీకరణ పత్రాల సేవలు కల్పించడమనేది కీలకమైందని, దీనికి సంబంధించిన పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ సేవలను పగడ్బందీగా ప్రజలకు అందిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. తెనాలీలో ముందుగా దీన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించాలని సూచించారు. అక్కడ క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులు, సాంకేతికంగా ఎదురయ్యే ఇబ్బందులను సునిశితంగా పరిశీలించి అధ్యయనం చేసి తదనుగుణంగా ఈ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. దీనికి కావాల్సిన అన్ని విధాల సహకారాన్ని పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ, పురపాలక శాఖలు ఆర్టీజీఎస్ అధికారులకు అందించాలని సూచించారు. ఆర్టీజీ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్‌ను అమలు చేయడానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ ఆర్టీజీఎస్ సిద్ధం చేసిందన్నారు. జనన మరణ ధృవీకరణ పత్రాలు వాట్సాప్ ద్వారా జారీ చేసే ప్రక్రియ కూడా క్షేత్రస్థాయిలో ఎలాంటి లోపాలకు తావివ్వకుండా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్టీజీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ ఈ నెలలోనే తెనాలీ మండలంలోని మొత్తం పంచాయతీల్లో, తెనాలీ పురపాలక సంఘంలో వాట్సాప్ ద్వారా జనన మరణ ధృవీకరణ పత్రాల జారీకి సంబంధించిన సాంకేతిక ప్రక్రియను ప్రయోగాత్మకంగా పరిశీలించి చూస్తామన్నారు. వాట్సాప్ ద్వారా ఈ సర్టిఫికెట్ల జారీ కొరకు ఆర్టీజీఎస్ ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ పేరిట ఒక పోర్టల్‌ను రూపొందించామన్నారు. ఇందులో జనన మరణ నమోదు డేటా మొత్తం అనుసంధానం చేస్తున్నామని తెలిపారు. డాటా లేక్ ఏర్పాటు పనులు కూడా చురుగ్గా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఒకసారి జనన, మరణ ధృవీకరణ పత్రం జనరేట్ అయితే ఆ వెంటనే సంబంధిత పౌరుల వాట్సాప్‌కు సందేశం పంపడంతో పాటు, ఆ వెంటనే వాట్సాప్ ద్వారానే ఈ పత్రాలు డౌనులోడు చేసుకునే సదుపాయం కూడా కల్పిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, పురపాలక శాఖ కార్యదర్శి కె. కన్నబాబు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ. సూర్యకుమారి, పంచాయతీరాజ్ శాఖ సంచాలకులు కృష్ణ తేజ, గ్రామవార్డు సచివాలయ శాఖ సంచాలకులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


### దావా సమను

**మహారాజశ్రీ 1వ అదనపు సివిల్ జడ్జ్ జూనియర్ డివిజన్ వారి కోర్టులో నూజివీడు, కృష్ణా జిల్లా,**

ఒ.యస్.నెం. 245/2022

బిట్వీన్ :

అడబాల ఉమామహేశ్వరరావు ......వాది

మరియు

శ్రీమతి మారుమూడి రాజామణి మరియు ఇద్దరు ......ప్రతివాదులు

**3 వ ప్రతివాది :** మారుమూడి కృష్ణ, తండ్రి తిరుపతి స్వామి, డోరు నెం. 4-34, హరిజనవాడ, గుడిపూడి గ్రామం, గుళ్ళపూడి పంచాయితీ, ముసునూరు మండలం, కృష్ణా జిల్లా.

పై నెంబరు గల దావాలో 3వ ప్రతివాది హాజరునిమిత్తం శ్రీ కోర్టువారు పై నెంబరు దావాను ది. 31-01-2025 కు వాయిదా వేసినారు. కాబట్టి 3వ ప్రతివాది పై నెంబరు దావాలో 31-01-2025 వ తేదీన ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టువారి ఎదుట హాజరుకావలెను. అట్లు హాజరుకానిచో 3వ ప్రతివాది పరోక్షమందు పై నెంబరుగల దావాను శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు అని తెలపడమైనది.

**కోర్టు వారి ఉత్తర్వులు మేరకు**
**కుమారి జిలపర్తి జీవిత**
**అడ్వకేటు, ఏలూరు**
**సెల్ నెం. 9542810793**

**ఏలూరు**
**ది.20-12-2024**

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలి

● ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేసిన ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు



**విజయనగరం,జనవరి 20 (వార్తాప్రభ) :** విజయనగరం నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని నియోజవర్గ ఎమ్మెల్యే అతిథి విజయలక్ష్మి గజపతిరాజు కి వినతి పత్రం ఇచ్చిన ఏఐఎస్ఎఫ్ నాయకులు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి పి .గౌరీశంకర్ మాట్లాడుతూ విద్యలనగరంగా పేరుగాంచిన విజయనగరంలో ప్రభుత్వం డిగ్రీ కళాశాలను 2019-20 విద్యా సంవత్సరంలో ప్రారంభించిన ప్పటికీ నేటికీ సొంతం భవనం లేదు అని ఆయన అన్నారు.తొలిత సొంత భవనం లేకపోవడం వల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాత్కాలికంగా తరగతులను ప్రారంభించారు. ప్రస్తుతం ప్రభుత్వ సాంస్కృతి డిగ్రీ కళాశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. సాంస్కృతిక డిగ్రీ కళాశాల ,ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఒకే చోట తరగతులు ఉన్నందున పూటకోక కళాశాల చొప్పున నిర్వహించాల్సి వస్తుంది.అరకొర సౌకర్యాలతో చాలీచాలని గదులతో,ఆరుబయట చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్నారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని,ప్రభుత్వం తక్షణమే స్పందించి నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంతభవనం ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు జస్వంత్ , సాయి , లీలకుమార్ ,ప్రవీణ్ ,మనోజ్ కుమార్,పవన్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం, మాజీ ఎంపీ అంజన్ కుమార్ చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరణ





**హైదరాబాద్,జనవరి 20 (వార్తాప్రభ) :** హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్ లో తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం ౦ 2025 నూతన క్యాలెండర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్, రాష్ట్ర సలహాదారి బేరి రామచంద్ర యాదవ్, తెలంగాణ రాష్ట్ర పంచాయతీ సర్పంచుల సంఘం వ్యవస్థాపకులు సౌధాని బుమన్న యాదవ్ ల ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మరియు మాజీ ఎంపీ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మందాడి అంజన్ కుమార్ యాదవ్ చేతుల మీదుగా ఘనంగా క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. అనంతరం గొర్రె కాపరుల సమస్యలపై వినతి పత్రం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 18 శాతం ఉన్న గొల్ల కురుమలకు రాజకీయ రంగంలో రిజర్వేషన్లు ఇవ్వాలని ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్లు, నామినేటెడ్ పోస్టులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, మల్లన్న దేవాలయాల కమిటీ చైర్మన్ లు ఇవ్వాలని కోరారు. గొర్రె కాపరులకు ప్రమాదవశాస్తూ మరణిస్తే జీవిత బీమా ద్వారా కుటుంబానికి 10 లక్షలు ఇవ్వాలని, 80% సబ్సిడీ ద్వారా మినీ పాల డైరీలు ఇవ్వాలని, పిడుగుపాటుకు చనిపోయిన గొర్రెలకు ఇన్సూరెన్స్ ద్వారా నష్టపరిహారం ప్రతి జీవానికి 5000 అందించాలని, చదువుకున్న గొల్ల కురుమ యువతి యువకులకు పశుసంవర్ధక శాఖలో ఉద్యోగ అవకాశాలు కలిపించాలని, గొర్రెలు, మేకలు మేపుకొనుటకు అడవిలో హక్కును కల్పించాలని, ప్రతి మండలంలో వారసంత ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ హాల్ కి నిధులుకేటాయించాలని, ప్రతి జిల్లాకు ఒక మాంస విక్రయ మార్కెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరడం నాయకులు జరిగింది. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అధ్యక్షులు మధు యాదవ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు చేగొండ రాజన్న యాదవ్, సంతోష్ యాదవ్, సత్యనారాయణ యాదవ్, మహేష్ యాదవ్, రాజేష్ యాదవ్, ఎంకె రాజేష్, వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# నైపుణ్యాల ద్వారానే ఉద్యోగ అవకాశాలు

● మల్లవల్లి ఇండస్ట్రీయల్ కారిడార్ లో 420 పరిశ్రమలు ● ఫిబ్రవరిలో అశోక్‌లేలాండ్ బాడీ బిల్డింగ్ యూనిట్ ప్రారంభించే అవకాశం ● స్వర్ణ భారత్ ట్రస్ట్ లో నైపుణ్య శిక్షణ పొందుతున్న యువతీయువకులతో ముఖాముఖీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్





**గన్నవరం,జనవరి 20 (వార్తాప్రభ) :** ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్ట్ లో నైపుణ్య శిక్షణ పొందుతున్న యువతీ యువకులతో ఏర్పాటు చేసిన ముఖా ముఖిలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో కలసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ మహనీయులు జన్మించిన గడ్డ కృష్ణాజిల్లా అని అలాంటి జిల్లా ఏడు నియోజకవర్గాలకు పరిమితం అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహనీయుల విగ్రహాలను కృష్ణాజిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేయకపోతే జిల్లా పరిషత్ సమావేశాలకు హాజరుకానని చెప్పారు. మల్లవల్లి పారిశ్రామికవాడకు 420 పరిశ్రమలు వస్తున్నట్లు ఆయన తెలిపారు. మల్లవల్లి ఇండస్ట్రీయల్ కారిడార్ లో పరిశ్రమల స్థాపన కోసం 183 కంపెనీలు స్థలాలు కేటాయించాలని ఏ.పి. ఐ.ఐ.సి అధికారులకు దరఖాస్తు చేసినట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో ఒక్క గన్నవరం నియోజకవర్గం నుంచే యువతకు 50 వేల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలో 15 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని లేని పక్షంలో రాజకీయాలలో కొనసాగనని చెప్పానని అందుకు తగ్గట్లుగానే ఉద్యోగాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఉద్యోగ మేళా నిర్వహించి పలువురికి హెచ్సీఎల్ లాంటి కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించామని .... ఈ నెల 28 వ తేదీన అమర్ రాజా కంపెనీ వారితో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు . గతంలో మల్లవల్లిలో పరిశ్రమలు స్థాపించి వెనక్కి వెళ్లిపోయిన సంస్థలను తిరిగి తీసుకువస్తున్నామని యార్లగడ్డ పేర్కొన్నారు. అశోక్‌లేలాండ్ సంస్థ ఇప్పటికే బాడీ బిల్డింగ్ యూనిట్‌ని ప్రారంభించనుందని, ఫిబ్రవరి లో అది ప్రారంభం అయ్యే అవకాశం ఉందని చెప్పారు.తమిళనాడు రాష్ట్రంలోని హొసూరు పారిశ్రామికవాడ తరహాలో మల్లవల్లి పారిశ్రామికవాడ కూడా అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించాలన్నదే తన ఆకాంక్ష అని త్వరలోనే మల్లవల్లి పరిశ్రమలతో కళకళలాడేలా తీర్చిదిద్దే బాధ్యతను తాను తీసుకుంటున్నానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెల్లడించారు.

# సిమెంట్ రోడ్ల నిర్మాణం పరిశీలన..



**జగ్గంపేట,జనవరి 20 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా నడిపిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అటు అమరావతి నిర్మాణం ఇటు పోలవరం నిర్మాణం ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం వంటి కార్యక్రమాలతో ఇది మంచి ప్రభుత్వాన్ని పేరు తెచ్చుకున్నారని అన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో ఆరు మాసాలు పూర్తికాకుండానే కోట్లాది రూపాయలతో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు సిమెంట్ రోడ్లు డ్రైన్లు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని అన్నారు. జగ్గంపేట శ్రీరామ్ నగర్, టవర్ కాలనీ, తదితర కాలనీలలో రోడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, కుంచే రామకృష్ణ, వేములకొండ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మనిర్భర్ పెట్టుబడిదారునిగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



**తణుకు, జనవరి 20 (వార్తాప్రభ) :** సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఐ) లిమిటెడ్ (సి. డి.ఎస్.ఎల్.) యొక్క ఇన్వెస్టర్స్ ప్రొటెక్షన్ ఫండ్ (ఐ.పి.బి.) భారతదేశంలోని పెట్టుబడిదారులకు ఆర్థిక పెట్టుబడుల పట్ల అవగాహన కల్పించి ప్రోత్సహించు కార్యకలాపములు నిర్వహించుటకు నిర్దేశించిన సంస్థ. ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తణుకు పట్టణంలో విద్యార్థులకు పెట్టుబడి గురించి అవగా హన కలిగించు కార్యక్రమం నిర్వహిం చింది. ఈ అవగాహన సదస్సును స్థానిక ఎస్. కె .ఎస్. డి. మహిళా కళాశాలలో నిర్వహించారు. ఈ సదస్సులో విద్యార్థులకు ఆర్థిక పెట్టుబడుల పైన అవగాహన పెంపొందించుటపై దృష్టి సారించి, పెట్టుబడిదారులకు పెట్టుబడులకు సంబంధించి నిర్ణయాలు తీసుకునే సాధికారతను కలిగించటమే కాక, పెట్టుబడి యొక్క ప్రధాన సూత్రాలను విద్యార్థులకు వివరించటం జరిగినది. ప్రధానంగా అందరికి అర్థం అయ్యే రీతిలో ఈ కార్యక్రమం తెలుగు బాష లో వక్తలు నిర్వహించటం వలన ప్రాంతీయ పెట్టుబడిదారులకు అత్యంత సులభంగా పెట్టుబడులు & డిపాజిటరీ సేవల ప్రాథమిక అంశాలు అర్థం చేసుకునే వీలు కలిగినది. ఈ సదస్సుకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరైనారు. సి.డి.ఎస్.ఎల్., ఐ.పి.ఎఫ్. పెట్టుబడిదారులకు క్యాపిటల్ మార్కెట్ లో అవగాహన కలిగించటంలోను మరియు మార్కెట్ సంక్లిష్టతలను పరిశోధించుటలోను కీలక పాత్ర పోషిస్తుంది. పెట్టుబడిదారులను ఆత్మనిర్భర్ పెట్టుబడిదారునిగా తీర్చిదిద్దుతకు కావలసిన పరిజ్ఞానం మరియు నైపుణ్యాతలను అందించాలనే లక్ష్యంతో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఆర్థిక పెట్టుబడులు గురించి పరిజ్ఞానం విస్తరింప చేయుటకు కట్టుబడి, ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా అనేక పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమాలను నిర్వహించుటకు ఉద్యమిస్తున్నాది. సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ భారతదేశం అంతటా పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాది. గత ఆర్థిక సంవత్సరం 2023-24లో దేశ వ్యాప్తంగా ఇంగ్లీషు, హిందీ మరియు 16 ఇతర ప్రాంతీయ బాషలలో పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమాలు (ఐ.ఏ.పి.) నిర్వహించాటమే కాక సుమారు 1.45 లక్షల మంది పెట్టుబడిదారులకు చక్కని అవగాహన కలిగించి చేరువైనది. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ఈ అవగాహన సదస్సులను ప్రాంతీయ బాషలలో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలియచేసారు.

# "కుష్టు" వ్యాధిని సమూలంగా నిర్మూలిద్దాం..

● వ్యాధి నిర్ధారణ పరీక్షలను సద్వినియోగం చేసుకోండి. ● జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.



**విజయవాడ,జనవరి 20 (వార్తాప్రభ) :** కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా ఈనెల 20వ తేదీ నుండి ఫిబ్రవరి 2వ తేది వరకు జిల్లాలో కుష్టు వ్యాధి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని "కుష్టు" వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాడంలో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. జిల్లా కుష్టు నివారణ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కుష్టు వ్యాధి పరీక్షలకు సంబంధించిన వాల్ పోస్టర్లను పోస్టర్లను, కరపత్రాలను సోమవారం స్థానిక శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి నివారణకు ప్రభుత్వ పరంగా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అవసరమైన అన్ని చర్యలను తీసుకోవడం జరుగుతుందన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న రోగులను ముందుగానే గుర్తించి సకాలంలో వైద్య సహాయం అందించగలిగితే వ్యాధిని త్వరితగతిన నివారించవచ్చునన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు జనవరి 20వ తేది నుండి ఫిబ్రవరి 2వ తేది వరకు మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, చెవులు, వీపు, ఎదపై నొప్పి లేని బొడిపెలు, కనుబొమ్మలు రెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్పలు మూతపడకపోవడం, ముక్కు దిబ్బడ, ముక్కు నుండి రక్తం కారడం, కాళ్ళు, చేతులు తిమ్మిర్లు, అరికాళ్ళు, అరిచేతులలో స్పర్శ కోల్పోవడం, చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, చేతుల నుండి వస్తువులు జారిపోవడం, చేతివేళ్ళు, కాళ్ళ వేళ్ళు వంకర్లు తిరగడం వంటి లక్షణాలు కలిగిన వారిని గుర్తించి వారికి సమీపంలోని వైద్య ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేయడం జరుగుతుందన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు కుష్టు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కుష్టు వ్యాధి గ్రస్తులకు ఆరోగ్య కేంద్రాలలోని ఆరోగ్య కార్యకర్త వద్ద యండిటి మందులను అందుబాటులో ఉంచి ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని వ్యాధి లక్షణలు ఉన్న వారు సద్వినియోగం చేసుకుని కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సహకరించాలన్నారు. జిల్లా కుష్టు నివారణ అధికారిణి డా. ఉషారాణి మాట్లాడుతూ జిల్లాలో కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఆశ వర్కర్లు, మేల్ వాలంటీర్లు, ప్రతి ఇంటిని సందర్శించి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి ఎఎన్ఎంలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. లక్షణాలు ఉన్న వారి డేటాను ప్రత్యేక యాప్ ద్వారా వైద్య అధికారులకు అందజేస్తారన్నారు. వైద్యాధికారులు లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి కుష్టు వ్యాధి నిర్ధారణ అయితే వ్యాధి తీవ్రతను బట్టి 6 నెల నుండి 12 నెలల వరకు ప్రతి నెల మందులను వైద్య సేవలను వ్యాధిగ్రస్తులకు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 54 లెప్రసీ కేసులను గుర్తించడం జరిగిందని వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రా ద్వారా వైద్య సేవలు అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. పోస్టర్లు, కరపత్రాల విడుదల కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మి నరసింహం, జిల్లా కుష్టు ఎయిడ్స్ టి.బి నివారణ అధికారిణి డా. జె. ఉషారాణి, డియంఅండ్‌హెచ్‌వో యం. సుహాసిని, డిఆర్‌డిఏ పిటి కె. శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఏ.పీ.ఆర్.ఎస్.ఏ. ప్రకాశం జిల్లా అధ్యక్షునిగా పిన్నిక మధుసూదన్



**ఒంగోలు,జనవరి 20 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షునిగా పిన్నిక మధుసూదన్ ఎన్నికైనది. వీరు మార్కాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన అనంతరం ఎస్వీకేపీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ చదివి, కడపలో ఫిజికల్ ఎడ్యుకేషన్ లో బ్యాచిలర్ డిగ్రీ చేశారు. మధుసూదన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ గా పని చేస్తూ "గ్రూప్ టూ" ఎగ్జామ్ లో రాష్ట్రస్థాయిలో ఆరవ ర్యాంకు సాధించి రెవెన్యూ సర్వీసెస్ కు కేటాయించబడ్డారు.వీరు ప్రకాశం జిల్లాలోని చీమకుర్తిలో రెండుసార్లు, కొమరోలు ,పెద్దారవీడు ,ఒంగోలు ,మార్టూరు ,బల్లికురవ, బేస్తవారిపేట, సంతనూతలపాడు ప్రాంతాలలో తహసిల్దారుగా సేవలందించి ప్రస్తుతం ఒంగోలు నియోజకవర్గంలోని సముద్ర తీర ప్రాంతమైన కొత్తపట్టం మండలానికి తహసిల్దారు గా పనిచేయుచున్నారు.ప్రస్తుతం మధుసూదన్ ప్రకాశం జిల్లా తహసిల్దార్ అసోసియేషన్ కు అధ్యక్షులుగా సేవలందిస్తున్నారు. వీరి తండ్రిగారైన స్వర్గీయ పిన్నిక గంగయ్య యాదవ్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ గా పనిచేసి ఉన్నారు.వీరి సోదరులు లక్ష్మి ప్రసాద్ యాదవ్ న్యాయవాద విద్యను అభ్యసించి ప్రస్తుతం ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ గా వ్యాపారం నిర్వహిస్తూ బీసీ సంఘాలతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలు చురుకైన పాత్ర వహిస్తున్నారు.



కేంద్ర మాజీ మంత్రి ప్రముఖ సినీ నటుడు నిర్మాత కీ!శే!! ఉప్పలపాటి కృష్ణంరాజు జయంతి వేడుకలు సందర్భంగా భీమవరం లోసోమవారం అభిమానుల ఆధ్వర్యంలో భారీ స్థాయిలో వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కృష్ణంరాజు సతీమణి శ్యామల దేవి వైద్య పరీక్షలు శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు సతీమణి శ్యామల దేవి తో రాష్ట్ర కృష్ణంరాజు యువసేన అధ్యక్షుడు వల్లూరు ప్రసాద్ కుమార్ పాల్గొన్న చిత్రం

–భీమవరం, జనవరి 20 (వార్తాప్రభ)

# రిమాండ్ లో కలగర రామచంద్రపురం వాసి



**విస్సన్నపేట,జనవరి 20 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని కలగర రామచంద్రపురం గ్రామానికి చెందిన బీవీ రెడ్డి మత్తు సంబంధిత పౌడర్ సరఫర నేర ఆరోపణలు తో రిమాండ్ కి పంపడం జరిగింది. వైజాగ్ నుండి డ్రగ్ అను-సంధాన పౌడర్ తీసుకువచ్చి కలగర రామచంద్రపురం కేంద్రంగా మిర్యాలగూడ నందు ఒక ల్యాబ్ కు సరఫరా చేస్తున్న సమాచారంతో ఎన్ఫోర్స్మెంట్ అధికారులు శనివారం సినీ పక్కీలో దాడి చేయడం జరిగింది. సంబంధిత పౌడర్ మరియు ఉపయోగించే మిషన్ తదితరాలను కారుతో స్వాధీనపరుచుకొని పరీక్షలకు పంపారు. ఆదివారం కలగర గ్రామంలో పంచనామా జరిపిన అనంతరం న్యాయస్థానానికి పంపగా చట్టపరంగా రిమాండ్ పంపినట్లుగా తెలుస్తోంది.

# పుట్రేల గవర్నర్ భూమి ప్రజాహితం కొరకు వాడాలి



**విస్సన్నపేట,జనవరి 20 (వార్తాప్రభ) :** భూదానోద్యమ పితామహుడు వినోబాభావే ఆశయం గొప్పది భూములు లేని పేదలకు భూస్వాములు సహాయపడే భూదాన ఉద్యమాన్ని ప్రారంభించిన ఘనత మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడిచిన విప్లవకారుడు భూదానోద్యమ పితామహుడు వినోబాబావే అన్న విషయం సర్వత్ర తెలిసిందే. 75 శాతం కంటే ఎక్కువ మందికి భూమిలేని పేద గ్రామస్తులు ఉండటాన్ని ఆయన గుర్తించడం జరిగింది. ఆయనను మొట్టమొదటిసారిగా ఆయనను కలిసిన గ్రామస్తులు 80 ఎకరాల సగం తడి భూములు మిగిలిన సగం పొడి భూములు కావాలని అడగడంతో వినోబాభావే మాట్లాడుతూ మొత్తం భూమి ప్రభుత్వం నుండి కాకుండా కొంత భూమి భూస్వాములు సహాయపడవచ్చు కదా అని అనటంతో ఆ సమయంలో వీ రామచంద్రారెడ్డి అనే భూస్వామి వంద ఎకరాలు భూమి ఇవ్వటం జరిగింది. భారతదేశంలో భూ సమస్యను పరిష్కరించే సామర్థ్యం ఈ ఉద్యమానికి ఉన్నదని ఆయన అనుకోవటంతో ఆనాటి నుండి భూదానోద్యమం ప్రారంభం కావడం a జరిగిందని తెలుస్తోంది. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం పుట్రేల గ్రామంలో కూడా భూదాన ఉద్యమానికి సంబంధించిన మూడు సెంట్లు భూమి ఆర్ఎస్ నెంబర్ 237లో ఉన్నదని ఆనాడు 1955 సెప్టెంబర్ 26వ తేదీన తిరువూరు రిజిస్టర్ ఆఫీస్ నందు 10 /11/1955 గా బొమ్మ రెడ్డి జమలారెడ్డి వినోబా భావే ఆశయాలకు ఆకర్షితుడై గవర్నర్ పేరున ప్రభుత్వానికి దానం చేస్తున్నట్లు రిజిస్ట్రేషన్ చేయటం జరిగిందని సంబంధిత భూమిని విడగొట్టి గ్రంథాలయం, పార్కు వంటి ప్రజాహిత కార్యక్రమాలకి ఉపయోగించవలసిందిగా సీనియర్ టిడిపి నాయకులు కోటగిరి వెంకట జగన్నాథం రావు అలియాస్ వాసు బాబు రెవెన్యూ శాఖకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

# గండేపల్లి గ్రామంలో మొదలైన రీ సర్వే ప్రక్రియ



**కంచికచర్ల,జనవరి 20 (వార్తాప్రభ) :** వ్యవసాయం మరియు ప్రైవేట్ భూముల రీ సర్వే ప్రక్రియ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి సూచనలతో కంచికచర్ల మండల తహసిల్దార్ సారధ్యంలో సోమవారం ఉదయం గండేపల్లి గ్రామంలో ప్రారంభించారు ఈ సందర్భంగా కంచికచర్ల మండల తహసిల్దార్ పి.జాహ్నవి మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా రీ సర్వే ప్రక్రియ జరుగుతుందని, గ్రామాన్ని బ్లాకులుగా విభజించి రీ సర్వే ప్రక్రియ చేపడతామని. ప్రతి బ్లాక్ లో 250 ఎకరాల అధిగమించకుండా సర్వే జరుగుతుందని ప్రతి బ్లాక్లో ఇద్దరు సర్వేయర్లు , వీఆర్వో, వీఆర్ఏ లను బృందంలా ఏర్పాటు చేయడమైనదని వ్యవసాయ భూముల యజమానులను వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి హద్దులు విషయంలో జాగ్రత్త పాటించనునట్లు యజమాని ఫీల్డ్ కు రాలేకపోతే వాట్సాప్ కాల్ లో హద్దులు చూపించే అవకాశం ఉందని పేర్కొన్నారు రీ సర్వే జరిగిన తర్వాత రాజముద్ర తో కొత్త పాసుబుక్ క్యూఆర్ కోడ్ తో జారీ చేయడం జరుగుతుందని ప్రకటించారు ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు సర్వేర్లు రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు

# జింజేరు లో పశువైద్య శిబిరాన్ని ప్రారంభించిన కాగిత కృష్ణ ప్రసాద్



**పెడన,జనవరి 20 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని పశుపోషకులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని పెడన నియోజకవర్గం శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. మండలంలోని జింజేరు గ్రామంలో ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరంను ఆయన సోమవారం . ప్రారంభించారు. పశుపోషకులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ తగిన నిధులు కేటాయిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తోంది. ఈ క్రమంలో పశువుల ఆరోగ్యానికి ఉత్పాదకతను పెంచడానికి వ్యాధులను నియంత్రించడానికి పశుపోషణ ఖర్చులు తగ్గించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఆర్థిక అండను కలగచేయడానికి వివిధ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు.పశుసంవర్ధక సేవలను పశుపోషకులకు మరింత చేరువ చేయడానికి ఈనెల 20 నుండి 31 వరకు అన్ని గ్రామలలో పశు ఆరోగ్య శిబిరాలు అవగాహనా సదస్సులు నిర్వహించడం జరుగుతుందని కాగిత అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసిఅర్జా నగేష్ మండల పార్టీ అధ్యక్షుడు సలపాటి ప్రసాద్ ప్రధాన కార్యదర్శి సీరం ప్రసాద్ నీటి సంగం అధ్యక్షుడు పరసా నాగరాజు అచ్చయ్య వారి పాలెం సర్పంచి వేముల సత్యనారాయణ మట్టా వెంకటేశ్వరరావు ఇన్చార్జి ఎంపీడీవో జయరాం సహాయసంచాలకులు బాబురావు మండల పశు వైద్య శాఖ అధికారి అల్తాఫ్ హుస్సేన్ పశు వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు

# అభివృద్ధిలో దేశానికి దిక్సూచిగా తెలంగాణ

**- శాసనసభ్యులు అరికపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి,జనవరి 20 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి డివిజన్ లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా రూ. 98 లక్షల వ్యయంతో శేరిలింగంపల్లి డివిజన్ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన.. శిల్పా గార్డెన్స్, క్రాంతివనం మరియు ఎన్ కె ఆర్ ప్రైడ్ కాలనీలలో నూతనంగా చేపట్టే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరేఖపూడి గాంధీ,శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..శేరిలింగంపల్లి డివిజన్ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని కాంగ్రెస్ పాలనలో క్రమక్రమంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు.అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా మారిందన్నారు.ఈ కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి,జిహెచ్ఎంసీ ఇంజనీరింగ్ సెక్షన్ డిఈ ఆనంద్, ఏఈ భాస్కర్,డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, పురం విష్ణు వర్ధన్ రెడ్డి,గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, సురభి కాలనీ ప్రెసిడెంట్ చంద్రశేఖర్,సయ్యద్ నయీమ్, కుటుంబరావు, రవికిరణ్,శిల్పా గార్డెన్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామ్ కిషోర్ యాదవ్, హరి,రామలింగేశ్వర రావు, సందీప్,సురేష్ బాబు,క్రాంతివనం అసోసియేషన్ ప్రెసిడెంట్ నర్సింహా రెడ్డి,మర్రి రెడ్డి,తిప్పన,ప్రకాష్ రెడ్డి,విఎన్ రెడ్డి,రాజశేఖర్,దీపక్ మరియు శ్రీనివాస్,మల్లేష్,విజయ్,పవన్, ఫకృద్దీన్,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# డొక్క తిప్పలకై న్యాయపోరాటం!!

- గీత కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలి
- ఎన్టీపిసి ఎలకలపల్లి, లక్ష్మీపురం గౌడ కులస్తులకు నష్టపరిహారం అందించాలి
- కులవృత్తిని నమ్ముకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి
- హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు వడ్లకొండ మహేందర్ గౌడ్



**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 20 (వార్తాప్రభ ప్రతినిధి)** డొక్క తిప్పలకై న్యాయపోరాటం చేస్తున్నామని ప్రకటనలో వివరాలను తెలియజేశారు నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ మహేందర్ గౌడ్. రామగుండం నియోజకవర్గం పరిధిలోని ఎలకలపల్లి, లక్ష్మీపురం గ్రామంలో గల ఈత చెట్లను ఎన్టిపిసి సంస్థ యాష్ పాండ్, సోలార్ ప్లాంట్ నిర్మాణం కోసం తొలగించడం అత్యంత బాధాకరమైన విషయమని ఆరోపించారు. గతంలో ఉన్నటువంటి నిబంధనల మేర నష్టపరిహారం చెల్లించకుండా దాటవేసే ధోరణి చూపెడుతున్న ఎన్టిపిసి యాజమాన్యం వైఖరి నశించాలని అన్నారు. పూర్తిస్థాయి వివరాలను కోరుతూ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ భాస్కర్ కు ఆర్టిఐ సమాచార పత్రాన్ని అందజేశారు. కులవృత్తిని నమ్ముకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి అని డిమాండ్ చేశారు.

# ఈనెల 22న ఉచిత వైద్య శిబిరం విజయవంతం చేయండి..

**కానం ప్రేమ్ కుమార్ గౌడ్**




**షాద్ నగర్ జనవరి 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కొండారెడ్డి పల్లి గ్రామ ప్రజల కోసం.. కొండారెడ్డిపల్లి గ్రామ యువ నాయకులు కానం ప్రేమ్ కుమార్ గౌడ్ గారి ఆధ్వర్యం లో ఈ నెల 22 వ తేదీన ఉదయం 8 గంటలకి ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేయనున్నారు. కావున గ్రామంలో ఆరోగ్య సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ షుగర్ బీపీ పరీక్షలు చేయించుకోగలరు గ్రామం లో ఉన్న ప్రతి ఒక్కరూ ఈ కార్య క్రమాన్ని విజయ వంతం చేయగలరు అని ఓ ప్రకటనలో కానం ప్రేమ్ కుమార్ గౌడ్ కొండారెడ్డిపల్లి గారు తెలిపారు.)

# ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని పరామర్శించిన కలెక్టర్ రాజర్షి షా,

**అదిలాబాద్ జనవరి 20:(వార్తా ప్రభ ప్రతినిధి).** గత శనివారం ఐసీఐసి బ్యాంకులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న బేల మండలం రేణిగూడ కు చెందిన రైతు జాదవ్ దేవరావ్ కుటుంబాన్ని సోమవారం జిల్లా పాలనాధికారి రాజర్షి షా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి తో కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఆదేశాల మేరకు రైతు కుటుంబాన్ని పరామర్శించి, రైతు ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకొని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.ఇందులో డీఎస్పీ జీవన్ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

# పదోన్నతి పట్ల పురస్కారం!!

- సేఫ్టీ ఆఫీసరుకు కార్మిక నాయకుల సన్మానం
- కంపెనీ కోసం శ్రమిస్తే ప్రమోషన్లు సహజం
- 11వ గని టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీ వాసర్ల జోసెఫ్



**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 20 (వార్తాప్రభ ప్రతినిధి)** కంపెనీ కోసం శ్రమిస్తే ప్రమోషన్లు సహజం అని అన్నారు 11వ గని టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీ వాసర్ల జోసెఫ్. ఈ మేరకు సోమవారం ఆ గని ఆవరణలో సేఫ్టీ ఆఫీసరుగా పదోన్నతి పొందిన ఎం.మల్లేశంను కార్మిక నాయకులు జోసెఫ్ తన బృందంతో కలిసి ఘనంగా సన్మానించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు జోసెఫ్ మాట్లాడుతూ...... సంస్థ అభివృద్ధి తన అభివృద్ధిగా, సంస్థ మనుగడే తన మనుగడగా భావించి చిన్న స్థాయి నుండి పెద్ద స్థాయి వరకు గల ప్రతి కార్మికునితో స్నేహ తత్వంతో విధులు నిర్వర్తించిన మల్లేశం సేఫ్టీ ఆఫీసరుగా నియమితులు కావడం అభినందనీయమని అన్నారు. సేఫ్టీ అధికారిని మార్గదర్శకంగా తీసుకొని ప్రతి అధికారి సంస్థ మనుగడ కోసం విధులు నిర్వర్తించాలి అని చప్పట్లతో ప్రశంసలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రాజేశం, సురేందర్, మల్లేష్, రవి, కిరణ్, సందీప్, అశోక్, సురేష్, రాజు, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# బరిలో నిలవడమే మొదటి గెలుపు!!

- పోలీసులకు లాంగ్ టెన్నిస్ ఆటల పోటీలు
- క్రీడా స్ఫూర్తి విధుల్లో సైతం కనబరచాలి
- శ్రమ ద్వారానే లక్ష్యం సాధ్యం
- రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్





**పెద్దపల్లి /రామగుండం: జనవరి 20 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం పోలీస్ కమిషనరేట్ మైదానంలో కాళేశ్వరం జోన్ లాంగ్ టెన్నిస్ ఆటల పోటీలు ప్రారంభించారు సీపీ ఎం.శ్రీనివాస్. ఈ మేరకు సోమవారం పోటీలను ప్రారంభించిన సీపీ పోలీసులకు పలు సూచనలను చేశారు. క్రీడా స్ఫూర్తి విధుల్లో సైతం కనబరచాలి అని అన్నారు. గెలుపు, ఓటమి అనే అంశం ఆలోచన చేయకుండా బరిలో నిలవడమే ప్రధాన, మొదటి గెలుపు అని తెలిపారు. శ్రమ ద్వారానే లక్ష్యం సాధ్యం అని అన్నారు. అత్యద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలలో సైతం బహుమతులు గెలుచుకోవాలి అని సూచించారు. లాంగ్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ వేడుకలలో అడిషనల్ డీసీపీ అడ్మిన్, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి, ఏఆర్ ఏసిపిలు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి ను కలిసిన బి.జె.పి.నాయకులు ఎత్తరి రమేష్



**కూకట్ పల్లి, జనవరి20(వార్తాప్రభ):** మాజీ రాజ్యసభ సభ్యుడు భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్ రావును ఆల్విన్ కాలనీ భారతీయ జనతా పార్టీ డివిజన్ నూతన అధ్యక్షుడు ఎత్తిరి రమేష్ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఆల్విన్ కాలనీ 124 డివిజన్ అధ్యక్షుడు ఎత్తరి రమేష్ ని గరికపాటి మోహన్ రావు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గరికపాటి మోహన్ రావు మాట్లాడుతూ అల్విన్ కాలనీ డివిజన్ ప్రజల కోసం నిత్యం అందుబాటులో ఉండి వారి అవసరాలను తీర్చడానికి కృషి చేయాలని భారతీయ జనతా పార్టీ కార్యకర్తలను నాయకులను అనుసంధానం చేసుకొని రాబోవు కార్పొరేటర్ ఎలక్షన్లలో ఆల్విన్ కాలనీ డివిజన్ లో భారతీయ జనతా పార్టీ జెండా ఎగరవేయాలని, రాజకీయపరంగా బీసీ నాయకుడిగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేందర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఓ బి సి మోర్చా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, పాల్గొనడం జరిగింది.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు.....

**కార్పొరేటర్ల తో కలసి భూగర్భ డ్రైనేజి పనులకు శంకుస్థాపన చేసిన శాసనసభ్యులు గాంధీ**



**శేరిలింగంపల్లి,జనవరి 20 (వార్తాప్రభ):** చందానగర్ డివిజన్ పరిధిలోని విశ్వేశరయ్య కాలనీ కెఎస్ఆర్ ఎనక్లేవ్ కాలనీలలో రూ.1 కోటి 35 లక్షల రూపాయల అంచనా వ్యయం తో నూతనంగా చేపట్టబోయే భూగర్భ డ్రైనేజి(యు జీ డి) పైప్ లైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్లు మంజుల రఘునాథ్ రెడ్డి,రాగం నాగేందర్ యాదవ్ మరియు జలమండలి అధికారులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని, పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చిన వినతి మెరకు మరియు మా కార్పొరేటర్లు,మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవ తో శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు,అత్యవసరం ఉన్న చోట,నిత్యం పొంగుతున్న ప్రాంతలలో ప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేశారు.ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామని,కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ,కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతు సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీ లు గా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఎన్నో ఏండ్ల సమస్య నేటి తో తిరునని,నిత్యం పొంగుతుండటం వలన కాలనీ వాసులు,ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు అని వాటిని దృష్టిలో పెట్టుకొని యుజిడి పైప్ లైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయడం జరిగినది అని,అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని,యుజీడి వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని,నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని, ప్రజలకు స్వచ్ఛమైన,చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని పీఏసీ చైర్మన్ గాంధీ చెప్పడం జరిగినది.పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పీఏసీ చైర్మన్ గాంధీ అధికారులను ఆదేశించడం జరిగినది,నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని,అన్నివేళలా ప్రజలకు అందుబాటులోకి ఉంటానని,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని,నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని,అదేవిధంగాసంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన,అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు..విశ్వేశ్వరయ్య కాలనీ లో రూ. 65.00 లక్షల రూపాయల అంచనావ్యయం తో నూతనంగా చేపట్టబోయే భూగర్భ డ్రైనేజి యు జి డి నిర్మాణం పనులకు.కె ఎస్ ఆర్ ఎనక్లేవ్ కాలనీ లో రూ. 70.00 లక్షల రూపాయల అంచనావ్యయం తో నూతనంగా చేపట్టబోయే భూగర్భ డ్రైనేజి( యు జి డి) నిర్మాణం పనులకు పైన పేర్కొన్న యుజిడి పనులకు శంకుస్థాపన చేయడం జరిగినది అని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం వెంకటేశ్వర్లు,మేనేజర్ సుబ్రమణ్యం,మరియు నాయకులు,కార్యకర్తలు, కాలనీ వాసులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రీడల ద్వారా సమిష్టితత్వం, పోరాట స్ఫూర్తి అలవడతాయి

**నేరేడ్ మెట్, జనవరి 20 (వార్తా ప్రభ ప్రతినిధి).** క్రీడలు వ్యక్తుల మానసిక వికాసానికి, శారీరక వికాసానికి తోడ్పడుతాయని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ పేర్కొన్నారు. సోమవారం సరూర్ నగర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమైన ఆరవ రాచకొండ పోలీస్ కమిషనరేట్ వార్షిక స్పోర్ట్స్ మీట్-2025 ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథి గా పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ క్రీడలు మన జీవితంలో ముఖ్య భాగమని, వివిధ రకాల మానసిక శారీరక ఒత్తిడులను అధిగమించడానికి క్రీడలు ఎంతో ఉపకరిస్తాయని పేర్కొన్నారు. రాచకొండ పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని, గరిష్ఠ శిక్షారేటు సాధిస్తూ గొప్పగా పని చేస్తున్నారని, వారికి విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడులను మరియు వివిధ రకాల సవాళ్ల నుంచి ఉపశమనం పొందేలా మరియు నూతనతేజంతో తమ విధి నిర్వహణలో పాల్గొనేలా చేయడానికి స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రీడా పోటీల ద్వారా వివిధ పోలీస్ విభాగాల మధ్య సుహృద్భావ వాతావరణం మరియు సమిష్టితత్వం ఏర్పడుతుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో అన్ని రకాల ప్రధాన క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని, గెలుపోటముల కంటే పోరాటమే ధ్యేయంగా క్రీడల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పోలీసు సిబ్బంది జట్లు మాత్రమే కాక మినిస్టిరియల్ సిబ్బందికి కూడా ఒక ప్రత్యేక జట్టు ఉంటుందని, అన్ని జట్లూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, ఆటల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడకూడదని సూచించారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా పోటీలు నిర్వహిస్తామని, రాచకొండ పరిధిలో పనిచేస్తున్న అన్ని పోలీసు విభాగాల సిబ్బంది మరియు మినిస్టీరియల్ సిబ్బంది కూడా ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిపి యాదాద్రి రాజేష్ చంద్ర ఐపిఎస్, డిసిపి ఎల్బీనగర్ ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, డిసిపి మల్కాజ్గిరి పద్మజ ఐపిఎస్, డిసిపి క్రైమ్ అరవింద్ బాబు, డిసిపి మహేశ్వరం సునీత రెడ్డి, డిసిపి ఎస్ఓటి 1 రమణారెడ్డి, డీసీపీ సైబర్ క్రైమ్ నాగలక్ష్మి, డిసిపి ఉమెన్ ఏసీపీ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వార్తా ప్రభ

# హైదరాబాద్

# నిర్లక్ష్యంపై వాట్సాప్ కంప్లైంట్!!

- "కాంట్రాక్టర్"పై చర్యలు తీసుకోండి
- ప్రజా సమస్యలపై అలసత్వం ఉపేక్షించం
- 20వ డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్



**పెద్దపల్లి/ రామగుండం: జనవరి 20 (వార్తాప్రభ ప్రతినిధి)** నిర్లక్ష్యంపై రామగుండం నగరపాలక సంస్థ ఇన్చార్జి కమిషనర్ అరుణ్ శ్రీకి 20వ డివిజన్ కార్పోరేటర్ కన్నూరి సతీష్ కుమార్ వాట్సాప్ మాధ్యమం ద్వారా కంప్లైంట్ చేశారు. డివిజన్లోని సంపు నిర్మాణం పట్ల అలసత్వం వహిస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తన విజ్ఞప్తి సందేశాన్ని పంపించినట్లు ప్రకటనలో వివరాలను తెలిపారు కార్పోరేటర్.

# కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి యువకుల పాత్ర కీలకం

**కాంగ్రెస్ నాయకులు బండి రమేష్**



**కూకట్ పల్లి, జనవరి 20(వార్తాప్రభ):** కాంగ్రెస్ పార్టీ మనుగడులలో యువత పాత్ర కీలకం అని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ బండి రమేష్ పేర్కొన్నారు. యువజన కాంగ్రెస్ నాయకులు మొయిస్ ఆరిఫ్ హమీద్ ఆధ్వర్యంలో మూసాపేటకు చెందిన పదుల సంఖ్యలో యువకులు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ బండి రమేష్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువా కప్పి అయన పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధిలో యువత చురుకుగా ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ నాయకులు సీనియర్ నాయకులు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బి. జె.పి.నాయకులు మందు మూల సంతోష్ కుమార్ గుప్తా జన్మదిన వేడుకలు...

**శుభాకాంక్షలు తెలియజేసిన వడ్డేపల్లి రాజేశ్వరరావు...**



**కూకట్ పల్లి,జనవరి 20(వార్తాప్రభ):** కూకట్ పల్లి డివిజన్ బిజెపి నాయకులు మందు మూల సంతోష్ కుమార్ గుప్తా జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు నో సంతోష్ కుమార్ గుప్తా మర్యాదపూర్వకంగా కలవగా వడ్డేపల్లి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, చేదురు మల్లి శ్రీనివాస్ గౌడ్,శంకర్ రెడ్డి,తీగల పాండురావు,కొమ్ము బాల తదితరులు పాల్గొన్నారు.-1

# సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన -మేయర్ శాంతి కోటేశ్ గౌడ్, -డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్,



**జవహర్ నగర్, జనవరి,20:(వార్తా ప్రభ)** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 11 వ డివిజన్ శివాజీ నగర్ లో కార్పొరేటర్ లక్ష్మీ కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో రూ. ఐదు లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టిన సిసి రోడ్డు పనులను ప్రారంభించిన మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గొడుగు వేణు, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, దయాకర్ చారి, బస్తీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, నాయకులకు శాలువాతో సన్మానించి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసిన కృష్ణ గౌడ్,

# ఎడిటోరియల్

## లోకేష్ డిప్యూటీ సీఎం..మాట్లాడొద్దంతే !

గత మూడు రోజులుగా మీడియాలో ఎటు చూసినా ఒకటే గోల. ఒక్కటే చర్చ. ఒక్కటే మాట. ఇదంతా దేని గురించి అంటే నారా లోకేష్ ని అర్జెంటుగా డిప్యూటీ సీఎం చేయాలని. అన్న గారి వర్ధంతి వేళ కడపకు వెళ్ళిన ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలోనే పొలిట్ బ్యూరో మెంబర్ శ్రీనివాసరెడ్డి నారా లోకేష్ ని డిప్యూటీ సీఎం ని చేయాలని అ విధంగా మూడవ తరాన్ని నాయకత్వ స్థానంలో ముందు పెట్టాలని కోరారు. అంతే ఆ రచ్చ అలా మొదలై ఈ రోజుకీ ఆగడంలేదు. నెల్లూరు జిల్లాల్కు చెందిన మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అందుకున్నారు. నారా లోకేష్ కి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాల్సిందే అంటూ రాగం కలిపారు. ఇక పిఠాపురం వర్మ జత చేరారు. ఆయన కూడా నారా లోకేష్ డిప్యూటీ సీఎం అయితే తప్పేంటి అన్నారు. ఇదంతా కార్యకర్తల మనోభావాలకు ప్రతీక అని మరో అడుగు ముందుకేశారు. రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అయితే నారా లోకేష్ డిప్యూటీ సీఎం ఏంటి ఏకంగా సీఎం కావాలని కూడా మాట్లాడారు. హోం మంత్రి అనిత అయితే నారా లోకేష్ నుదిటిన ఏమి రాసి ఉంటుందో అదే జరుగుతుందని దానిని ఎవరూ ఆపలేరంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. అంతా దైవేచ్ఛ అని కూడా వేదాంతం వల్లించారు. ఇలా ఒక వైపు అంతా నారా లోకేష్ డిప్యూటీ సీఎం అంటూ ప్రచారం హోరెత్తిస్తున్న వేళ జనసేన నుంచి ధీటుగా బదులు వస్తోంది. వారు సైతం మా నాయకుడు పవన్ కళ్యాణ్ సీఎం అయితే లోకేష్ డిప్యూటీ సీఎం అంటూ కొత్త డిమాండ్ ముందుకు తెస్తున్నారు. ఇలా కూటమిలో సడెన్ గా ఈ రకమైన డిమాండ్లతో రాజకీయ రచ్చ పీక్స్ చేరుతున్న నేపథ్యంలో తెలుగుదేశం అధినాయకత్వం అలెర్ట్ అయింది. ఆపండి అంటూ తమ్ముళ్లకు పార్టీ సీనీయర్లకు సూచించింది. నారా లోకేష్ సీఎం అన్న ప్రచారానికి ఇంతటితో ఫుల్ స్టాప్ పెట్టాలని కూడా కోరింది. లోకేష్ డిప్యూటీ సీఎం అంటే అదంతా సాఫీగా జరిగేలా కనిపించడం లేదు, పైపెచ్చు సీన్ లోకి జనసేన వచ్చేసింది. ఆ పార్టీ నేతలు సరికొత్త డిమాండ్లు పెడుతున్నారు. సోషల్ మీడియాలో తమ్ముళ్ళకు జన సైనికులకు మధ్య డైలాగ్ వార్ స్టార్ట్ అయిపోయింది. ఈ నేపథ్యాన్ని అంతా చూసిన హై కమాండ్ ఆ మాట ఎత్తొద్దు అంటూ కఠినమైన ఆదేశాలనే జారీ చేసింది. దీనిని అతి ఉత్సాహంగా కూడా పేర్కొంది. దానిని వదులుకోవాలని నేతలకు సున్నితంగానే సూచించింది. ఎవరికి తోచిన తీరులో వారు వ్యక్తిగత అభిప్రాయాలు మాట్లాడవద్దు అంటూ కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏకంగా టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి సోమవారం టీడీపీ అధికార ప్రతినిధులకు స్వయంగా ఫోన్లు చేసి మరీ నోటికి తాళాలు వేయాలని కూడా కోరిందని అంటున్నారు. మొత్తం మీద చూస్తే ఇది ఎటు నుంచో మొదలై ఎటో పోతోందని అధినాయకత్వం గ్రహించింది అంటున్నారు. ఆ మీదటనే ఆగ్రహించింది అని కూడా చెబుతున్నారు

## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించండి-సిఐ చంద్రశేఖర్

**మైలవరంలో ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చిన సీఐ**



**మైలవరం :జనవరి 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ దాడి చంద్రశేఖర్ వెల్లడించారు.రహదారి ప్రమాదాల నియంత్రణలో భాగంగా హెల్మెట్ లేకుండా తిరుగుతున్న ద్విచక్ర వాహన ప్రయాణికులను, ఒకే బైక్ పై ముగ్గురుగా ప్రయాణిస్తున్న వారిని,బైక్ నడుపుతున్న మైనర్లు ను ఆపి వారికి హెల్మెట్ ధరించకపోవడం వలన జరిగే నష్టాల ను,మైనర్లకు బైక్ ఇస్తే తల్లిదండ్రు లపై తీసుకునే చర్యల గురించి సర్కిల్ ఇన్స్పెక్టర్ శనివారం సాయంత్రం మైలవరం పట్టణంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయం ఎదురుగా ప్రధాన కూడలి వద్ద హెల్మెట్ లేకుండా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా త్రిబుల్ రైడ్ చేస్తూ బైక్ లను నడుపుతున్న మైనర్ బాలురులకు కౌన్సిలింగ్ ఇచ్చి 20 బైకు లను సీజ్ చేశారు.మైనర్ బాలురకు బైకులు ఇచ్చిన వారిపై మరియు బైక్ ఓనర్లపై చట్టపరమైన చర్య తీసుకుంటా మని హెచ్చరించారు.

# నాన్న సూక్తి సుధ



సత్కార్యాలు చేస్తే
మానవుడే మాధవుడు
పనికిరాని పనులతో
అవుతాడోయ్! దానవుడు
పగటినేలే ఘన రేడు
జగతిలోన మార్తాండు
చీకటిని తరిమికొట్టు
వెలుగు మోము మొనగాడు
ఆపదలోన ఆప్తుడు
కనిపించే భగవానుడు
అట్టి వాడు ఆత్మీయుడు
గౌరవానికి పాత్రుడు

చెడ్డ పనులు చేసి చేసి
తెచ్చుకోకు పెద్ద కీడు
వ్యసనాలే ముదిరితే
బ్రతుకగును వల్లకాడు
చేతనైతే సాయపడు
ఆపకారము తలపెట్టకు
ముందు చూపు కలిగి నడు
ఆందోళన చెందబోకు

**గద్వాల సోమన్న ,**
**9966414680**

## గణతంత్ర దినోత్సవం సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై ముఖ్య అధికారులతో నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు







**విజయవాడ పశ్చిమ జనవరి 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 26.తేదిన ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగబోతున్న గణతంత్ర వేడుకల భద్రత ఏర్పాట్లను గురించి సోమవారం ఎన్.టి.ఆర్. జిల్లా నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు మరియు జిల్లా కలెక్టర్ జి.లక్ష్మి షా ల ఆధ్వర్యంలో పోలీసు అధికారులు మరియు జిల్లా అధికారులతో ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం నందు ఆయా శాఖల అధికారులు చేయు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో నగర పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ... గణతంత్ర వేడుకలలో పాల్గొనడానికి రాష్ట్ర గవర్నర్ , ముఖ్యమంత్రి , మినిస్టర్లు మరియు వి.వి.ఐ.పి.లు/ వి.ఐ.పి.లు మరియు ప్రజలు ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంకు విచ్చేస్తారు. ఈ నేపధ్యంలో స్టేడియం పరిసర ప్రాంతాలలో సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని చేయు కట్టు దిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాట్ల గురించి, వేడుకల్లో కంటిజెన్సీ బృందాలు కవాతు ఏర్పాట్ల గురించి, ట్రాఫిక్ ఏర్పాట్ల గురించి కూలకుషంగా చర్చించారు.స్టేడియం నందు,పరిసర ప్రాంతాలలో భద్రతా పరంగా ఎటువంటి చిన్న లోపాలు లేకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని ఉన్నత అధికారులుకు ఆదేశాలు జారి చేసారు. ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం మరియు పరిసర ప్రాంతాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో అప్రమత్తంగా పటిష్టమైన బందోబస్త్ ఏర్పాట్లపై, ఇతర ప్రయాణికులకు వారి ప్రయాణంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఇతర మార్గాలను నిర్దేశించే విధంగా, వాహనాల రద్దీ ఏర్పడకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, జిల్లా కలెక్టర్ జి.లక్ష్మి షా, డి.ఐ.జి. ఐ.ఎస్.డబ్ల్యూ కె.ఆరిఫ్ హఫీజ్ , డి.సి.పి. గౌతమీ షాలి, ఎస్.వి.డి.ప్రసాద్, ఏ.డి.సి.టూ గవర్నర్ ఎన్.వి. రామాంజనేయులు, సబ్ కలెక్టర్ కె.చైతన్య, మునిసిపల్ అడిషనల్ కమీషనర్ డి.చంద్ర శేఖర్ , ఏ.డి.సి.పి.లు ఎ.వి.ఎల్ .ప్రసన్న కుమార్ , కె.కోటేశ్వర రావు , కే.డి.ఎం.వి.ఆర్.ప్రసాద్, ఎస్. వి.రమణ , ఏ.సి.పి.లు, ఇతర శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అంతటి చరిష్మా ఉన్న నాయకుడు నారా లోకేష్.....

**తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫతావుల్లాహ్**



**విజయవాడ పశ్చిమ జనవరి 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అంతటి చరిష్మా గల నాయకులు నారా లోకేష్ అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లాహ్ అన్నారు. గణపతి రావు రోడ్డు లోని ఖిద్ మత్ ఘర్ కార్యాలయంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫతాఉల్లాహ్ ముస్లిం మత గురువులతో కలిసి మీడియా సమావేశం ఏర్పటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందమూరి తారక రామారావు అంతటి చరిష్మా ఉన్న నాయకుడు నారా లోకేష్ అని అన్నారు. నారా లోకేష్ అనేక సంవత్సరాల నుంచి తెలుగుదేశం పార్టీలో ఒక క్రియాశీల కార్యకర్తగా ఒక క్రియాశీల నాయకుడిగా పనిచేస్తూ తెలుగుదేశం పార్టీకి అన్ని విధాలుగా అండగా నిలబడ్డ నాయకుడు అని అన్నారు .తెలుగుదేశం పార్టీ పని అయిపోయిందని ప్రతిపక్షాలు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నప్పుడు నేనున్నానని ప్రజల మధ్యకు వచ్చి వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి తెలుగుదేశం కార్యకర్తల్లో ఒక జోష్ ఒక భరోసా తెచ్చి రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవ్వటానికి దోహదపడిన నాయకుడు నారా లోకేష్ అన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం రాష్ట్రంలో కోటి మంది తీసుకున్నారంటే అది నారా లోకేష్ అలుపెరుగని కృషే అన్నారు . నారా లోకేష్ ను ఇప్పుడు ఉపముఖ్యమంత్రిగా భవిష్యత్తులో ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు అనుకుంటున్నారని కావున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు త్వరగా స్పందించి ప్రజల కార్యకర్తల అభీష్టం మేరకు నారా లోకేష్ ను ఉపముఖ్యమంత్రిగా నియమించాలని మొహమ్మద్ ఫతాఉల్లాహ్ డిమాండ్ చేసారు.ఈ సమావేశంలో మౌలానా సత్తార్ ఖాన్, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, మైనారిటీ సెల్ మాజీ అధ్యక్షులు షేక్ ఇర్ఫాన్, విజయవాడ పార్లమెంట్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు తమేం అన్సార్, 57 డివిజన్ అధ్యక్షుడు జహెద్, ఇంకా అనేక ముస్లిం మత గురువులు పాల్గొన్నారు.

## కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కె.ఆర్.ఎం.బి) కార్యాలయాన్ని

# కృష్ణా బేసిన్ విజయవాడలోనే ఏర్పాటు చేయాలి.

**● కృష్ణాజలాల కేటాయింపులపై ఆంధ్రా నీటి హక్కులను కాపాడాలి. ● కె.ఆర్.ఎం.బి ఛైర్మన్ అతుల్ జైన్ కు విజ్ఞప్తి చేసిన సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు**





**విజయవాడ పశ్చిమ జనవరి 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని గత వై.సి.పి ప్రభుత్వం విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలన్న అసంబద్ధ నిర్ణయాన్ని పునఃసమీక్షించి కృష్ణా బేసిన్ విజయవాడలోనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ ఎపెక్స్ కమిటీ మాజీ సభ్యులు, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు నేతృత్వంలో సాగునీటి సంఘాలు ఏ.పి రాష్ట్ర సారధులు నాగార్జునసాగర్ కుడి కాలువ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పులుకూరి కాంతారావు, వైస్ ఛైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి, కృష్ణా తూర్పు డెల్టా డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ లు యార్లగడ్డ రవిబాబు, కొమ్మారెడ్డి రాజేష్, నాగార్జునసాగర్ ఎడమ కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ లు దేవినేని సత్యనారాయణ, పామర్తి శ్రీనివాసరావు ఇతర కార్యవర్గ సభ్యులు ఈరోజు ఉదయం హైదరాబాద్ జలసౌధలోని కె.ఆర్.ఎం.బి కార్యాలయంలో కె.ఆర్.ఎం.బి ఛైర్మన్ అతుల్ జైన్ ను కలిసి పూర్తి వివరాలతో వినతిపత్రం సమర్పించారు. ఇదే విషయమై ఈరోజు సాయంత్రం విజయవాడలోని రాష్ట్రసాగునీటి సంఘాల సమాఖ్య కార్యాలయం నుండి రాష్ట్ర జలవనరుల శాఖ మాజీ ఎపెక్స్ కమిటీ సభ్యులు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లోని కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో అన్ని రకాల మానిటరింగ్ చేయటానికి కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఏర్పడిందని ఈ విషయం మీద దీని ప్రధాన కార్యాలయాన్ని విజయవాడలోనే ఏర్పాటు చేయటానికి 2018 జనవరిలో ఇబ్రహీంపట్నం ప్రాంతంలో భవనాలను కూడా పరిశీలించటం జరిగిందని, వై.సి.పి ప్రభుత్వం ఏర్పడినాక జూన్ 2020లో అప్పటి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి విజయవాడలోనే కె.ఆర్.ఎం.బి కార్యాలయం ఏర్పాటు చేయటానికి కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాస్తూ దాని ప్రతిని కె.ఆర్.ఎం.బి సభ్యకార్యదర్శి, హైదరాబాదకు పంపడం జరిగిందని, అలాగే 2019 నవంబరులోను, 2020 ఆగస్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయవాడలోనే కె.ఆర్.ఎం.బి కార్యాలయం ఏర్పాటు చేయాలని కేంద్ర జలశక్తి శాఖకు లేఖ రాయటం జరిగిందని తెలిపారు. 2020 అక్టోబరులో కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో జరిగిన 2వ ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కె.ఆర్.ఎం.బి కార్యాలయం ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడలో ఏర్పాటు చేయుట గురించి రెండు తెలుగు రాష్ట్రాల అధికారులు చర్చించటం జరిగింది. కృష్ణానది పరీవాహక ప్రాంతంలో శ్రీశైలం, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజి క్రింద ఉమ్మడి కర్నూలు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో 30 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని విజయవాడ పట్టణం కృష్ణానది ఒడ్డున రైల్, రోడ్డు, విమాన సౌకర్యం కలిగి ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ అధికారులు, తెలంగాణ ప్రభుత్వ అధికారులు, ఆయకట్టుదారులు, నీటి సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను కె.ఆర్.ఎం.బి దృష్టికి తీసుకురావటానికి అనుకూలంగా ఉంటుందన్నారు. ఇన్ని సానుకూల అంశాలు ఉన్న విజయవాడలో కాకుండా కృష్ణా డెల్టాకు 400 కి.మీ, ఎన్.ఎస్.పి కి 700 కి.మీ, శ్రీశైలంకు 800 కి.మీ లకు దూరంగా గోదావరి బేసిన్ అవతల వున్న విశాఖపట్నంలో మూడు రాజధానుల్లో భాగంగా కార్యనిర్వాహక రాజధాని నెపంతో కె.ఆర్.ఎం.బి కార్యాలయాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని గత వై.సి.పి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో కేంద్ర జలశక్తి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2014-2019, 2019-2024 మధ్య జరిగిన నిర్ణయాలను పరిగణనలోనికి తీసుకుని విజయవాడలోనే కార్యాలయాన్ని ఏర్పాటు చేయటానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కె.ఆర్.ఎం.బి ఛైర్మన్ అతుల్ జైన్ కు విజ్ఞప్తి చేశారు. దీని ప్రతులను కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి శ్రీమతి దేబశ్రీ ముఖర్జీ, న్యూఢిల్లీకి పంపి ఈ విషయంలో జోక్యం చేసుకుని ఆంధ్రా రైతుల నీటి హక్కులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. దీనిమీద కె.ఆర్.ఎం.బి ఛైర్మన్ విజయవాడలో కార్యాలయం ఏర్పాటు చేయటానికి సానుకూలంగా స్పందించారని 'ఆళ్ళ' తెలిపారు. అట్లాగే ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో సరిపడినంత నీరు ఉన్నందున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరిన విధంగా నాగార్జునసాగర్ 3వ జోన్ కు డిసెంబర్, జనవరి మాసాలకు 12 టి.ఎం.సి లు నీరు విడుదల చేయాలని కె.ఆర్.ఎం.బి డిసెంబరు 5న ఉత్తర్వులు ఇచ్చినా ఇంతవరకు ఆంధ్రప్రదేశ్ కు 2.9 టి.ఎం.సి లు మాత్రమే నీరు వచ్చిందని ఈ నెలలోనే సాగునీటిని విడుదల చేసి నాగార్జునసాగర్ ఎడమకాలువ ఆయకట్టులో ప్రస్తుతం ఉన్న మామిడి, పొగాకు, జొన్న, పత్తి, మిర్చి, మినుము, పెసర, ఆయిల్ పామ్ తదితర ఆరుతడి పంటలను రక్షించాలని కె.ఆర్.ఎం.బి ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చినట్లు, అట్లాగే బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన 811 టి.ఎం.సి లలో ఆంధ్రప్రదేశ్ కు 512 టి.ఎం.సి ల వాటా యదాతథంగా కొనసాగించటానికి చర్యలు తీసుకుని ఆంధ్రప్రదేశ్ నీటి హక్కులను కాపాడాలని కె.ఆర్.ఎం.బి ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చినట్లు 'ఆళ్ళ' తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమకాలువకు తెలంగాణ నుంచి నీటి విడుదల సమయంలో ఆవిరి లెక్కలను కె.ఆర్.ఎం.బి అధికారులను పంపించి లెక్కించాలని విజ్ఞప్తి చేశారు. నాగార్జునసాగర్ కుడికాలువ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పులుకూరి కాంతారావు మాట్లాడుతూ నాగార్జునసాగర్ కుడికాలువ హెడ్ రెగ్యులేటర్ ఆంధ్రప్రదేశ్ భూభాగంలో ఉన్నప్పటికి తెలంగాణ ప్రభుత్వమే నిర్వహణ చూస్తోందని దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అప్పగించి ప్రస్తుతం దీనిమీద వున్న సి.ఆర్.పి దళాలను తొలగించి వీటి నిర్వహణ సజావుగా జరగటానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ లో ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల వ్యవస్థలో కొత్తగా ఎన్నికైన సాగునీటి సంఘాల రాష్ట్ర ప్రతినిధులు కె.ఆర్.ఎం.బి చైర్మన్ అతుల్ జైన్ కు రైతు కండువా వేసి పూలమొక్కతో ఘనంగా సత్కరించారు.

## బందరు డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రాజా




**మచిలీపట్నం జనవరి 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**బందరు డిఎస్పీగా చప్పిడి రాజా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా చప్పిడి రాజా బందర్ సబ్ డివిజన్ కు డిఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యత స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. బందర్ సబ్ డివిజన్ డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన చప్పిడి రాజాకు సాధర స్వాగతం పలికిన సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్సైలు.

## నలభై లక్షలతో చింతలమోరు ఆరుతెగలపాడు రోడ్డు నిర్మాణం.

**ఎమ్మెల్యే కామినేని కి కృతజ్ఞతలు తెలియజేస్తున్న గ్రామస్తులు, ప్రయాణికులు.**





**కలిదిండి జనవరి 20 (వార్తా ప్రభ)** చింతలమో రు,ఆరు తెగలపాడు రోడ్డు 40 లక్షలతో నిర్మాణం చేపట్టడంతో ఆరుతెగల పాడు మరియు చింతలమూరు గ్రామస్తులు ఎమ్మెల్యే కామినేనికి కృతజ్ఞతలు తెలియజేశారు .కైకలూరు. నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆర్ అండ్ బి అధికారులు కలిదిండి మండలం కాళ్లపాలెం పంచాయితీలో చింతలమూరు నుంచి ఆరుతెగలపాడు గ్రామం చెక్ పోస్ట్ వరకు రూ. 40,00,000/- (నలభై లక్షల రూపాయిలు) నిధులతో తారు రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు,వాహన దారులు హర్షం వ్యక్తం చేస్తూ శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలియజేసారు.

## దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు విజయవంతం కావాలి

**తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్సీ సెల్ దళిత రత్న పరిశపోగు రాజేష్.**



**విజయవాడ పశ్చిమ జనవరి 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర యువత భవిష్యత్తును మార్చేలా ఆంధ్రప్రదేశ్ను పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దే సంకల్పంతో ముందుకు సాగుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి రాష్ట్ర మంత్రివర్యులు యువనేత నారా లోకేష్ కి దళిత రత్న పరిశపోగు రాజేష్ మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలిపారు.ప్రపంచ పెట్టుబడుల వేదికపై ఆంధ్ర ప్రదేశ్ ను సగర్వంగా నిలిపేందుకు దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు విజయవంతం కావాలని దళితరత్న పరిశపోగు రాజేష్ ఒక ప్రకటనలో ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు.

# నేటి నుంచి ఆధార్ క్యాంపులు

ఇబ్రహీంపట్నం, జనవరి 20 (వార్తా ప్రభ ప్రతినిధి):- **మండలంలోని సచివాలయాల పరిధిలో ఈ నెల 21 నుంచి 24 వరకు అంగన్ వాడీ కేంద్రాల పరిధిలో పెండింగ్ ఆధార్ లు పూర్తి చేసేందుకు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సునీత శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21, 22 తేదీల్లో దాములూరు ఎంపీ యూపీ ఉర్దూ స్కూల్, 21న త్రిలోచనపురం, జూపూడి అంగన్ వాడీ సెంటర్లలో, 22న కేతనకొండ, తుమ్మలపాలెం ఎంపీయూపీ స్కూళ్ళలో, 23న చిలుకూరు, కొటికలపూడి ఎంపీ యూపీ స్కూళ్లు, గుంటుపల్లి జడ్పీ హైస్కూల్ లో, 24న కాచవరం ఎంపీ యూపీ స్కూల్, మూలపాడు జడ్పీ హైస్కూల్, గుంటుపల్లి జడ్పీ హైస్కూల్ లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఆధార్ క్యాంపుల వద్ద కొత్తగా ఆధార్ కార్డు నమోదు, ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలకు బయోమెట్రిక్ అప్డేట్, మొబైల్ నెంబర్ లింక్, చిరునామా, పుట్టిన తేదీల్లో మార్పులు, చేర్పులు చేయనున్నట్లు వివరించారు.**

# పెండింగ్ అర్జీలపై జాయింట్ కలెక్టర్ సమీక్ష

**మచిలిపట్నం జనవరి 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజా సమస్యల పరిష్కార వేదిక "మీకోసం" లో వచ్చిన అర్జీల పరిష్కారంలో గడువు దాటిన అర్జీలపై, పెండింగ్ కోర్టు కేసులపై దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ సోమవారం కలెక్టరేట్లో మీకోసం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసంలో పెండింగ్ అర్జీలపై జాయింట్ కలెక్టర్ సమీక్షిస్తూ గడువు దాటేదాకా ఉండకూడదని, గడువులోగానే అర్జీలు పరిష్కరించాలన్నారు. వివిధ శాఖలలో పెండింగ్ కోర్టు కేసులు సమీక్షిస్తూ కోర్టు తుది ఆదేశాలు అమలు పరచక పోవడంతో కోర్టు ధిక్కరణ కేసులు పడుతున్నాయని, ఆ విధంగా జరగకుండా పెండింగ్ కోర్టు కేసులపై దృష్టి సారించాలన్నారు. కోర్టు ధిక్కరణ కేసులలో ఇప్పటివరకు తీసుకున్న చర్యలు సమీక్షించి, కోర్టు ఆదేశాలు సకాలంలో అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని సందర్భాల్లో కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తుందని, వాటిని కూడా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించుటకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. యువ ఓటర్లకు ఫోటో ఓటర్ కార్డుల పంపిణీ, వృద్ధ ఓటర్లను సన్మానించడం, కళాశాల విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి ఓటు హక్కు యొక్క ప్రాముఖ్యత తెలియజేస్తూ ఓటర్లను చైతన్యవంతం చేయాలని అన్నారు. ఈనెల 26 గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుటకు చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్ వారి ప్రసంగపాటం సిద్ధం చేయాలని, వివిధ శాఖలలో ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందించుటకు పేర్లు వెంటనే పంపాలని అధికారులకు సూచించారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ కుష్టు వ్యాధి విభాగం ద్వారా కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమం పై ముద్రించిన పోస్టర్లు, కరపత్రాలను జాయింట్ కలెక్టర్ విడుదల చేశారు. జిల్లాలో కుష్టు



వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకు ఇంటింటి సర్వే ఈరోజు నుండి ప్రారంభించి ఫిబ్రవరి 2 వరకు నిర్వహిస్తున్నట్లు, వివిధ శాఖల అధికారులు సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఎస్ శర్మిష్ట తెలిపారు.

**మీకోసం అర్జీలలో..**బాపులపాడు మండలం ఓగిరాల గ్రామంలో



తాగునీరు కలుషితం, మంచినీటి పథకం ఫిల్టర్ రిపేర్ చేయించాలని కొలువురు గ్రామస్తులు గ్రామపంచాయతీ సభ్యులు అర్జీ సమర్పించారు. గురజాడ గ్రామంలో జాతీయ రహదారి విస్తరణ రెండవ దశలో సేకరించిన తన భూమికి నష్టపరిహారం ఇంతవరకు అందలేదని, ఇప్పించాలని కోరుతూ పిసికే ప్రసాద్ తదితరులు అర్జీ సమర్పించారు. మొవ్వ మండలం పెదపూడి గ్రామానికి చెందిన పెదపూడి శ్రీనివాసరావు తనకు పిత్రార్జితంగా సంక్రమించిన భూమికి పట్టాదారు పాసుబుక్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కృత్తివెన్ను మండలం సీతనపల్లి గ్రామానికి చెందిన గాదం నాగేశ్వరరావు తన స్వార్జిత భూమిని రెవిన్యూ రికార్డుల్లో నమోదు చేయించాలని కోరుతూ అర్జీ ఇచ్చారు. బందరు ఆర్డిఓ కే స్వాతి, సివిల్ సప్లై డిఎం పద్మాదేవి, మెప్మా పిడి సాయిబాబు జాయింట్ కలెక్టర్ తో పాటు మీకోసం లో పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. జడ్పీ సీఈవో కె కన్నమనాయుడు, పంచాయతీరాజ్ ఎస్ఇ రమణ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, డ్వామా పిడి కె.వి శివప్రసాద్ యాదవ్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.పద్మావతి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

## ఏపీ ఎమ్మార్పీఎస్ అమరావతి రాజధాని అధ్యక్షుడిగా నాగమల్లేశ్వరరావు



**ఇబ్రహీంపట్నం, జనవరి 20 (వార్తా ప్రభ ప్రతినిధి):-** ఏపీ ఎమ్మార్పీఎస్ అమరావతి రాజధాని అధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నానికి చెందిన మంద నాగమల్లేశ్వర రావు మాదిగ నియమితులయ్యారు. విజయవాడ గాంధీ నగర్ లోని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధన కోసం ఆంధ్ర - తెలంగాణ రాష్ట్రాల జాతీయ సమావేశం ఫిబ్రవరి 5న ఐలాపురం కన్వెన్షన్ హాల్ లో జరుగుతుందన్నారు. ఈ జాతీయ సమావేశానికి ఆంధ్ర, తెలంగాణ మాదిగ సంఘాల నాయకులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నాగమల్లేశ్వర రావును అభినందించారు. సమావేశంలో ఏపీ ఎమ్మార్పీఎస్ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆలేటి ఏసుపాదం, జి.కొండూరు మండల అధ్యక్షుడు కోపూరు ఏడుకొండలు, కొండపల్లి పట్టణ అధ్యక్షుడు నంబూరు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో నేరాలు తగ్గాయి - రాష్ట్ర డీజీపీ.



**కాకినాడ : జనవరి 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు కాకినాడలో పర్యటించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో డీజీపీ సమావేశం నిర్వహించారు. అనంతరం డీజీపీ ద్వారకా తిరుమలరావు మీడియా సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో క్రైమ్ రేట్ తగ్గిందని, నేరాలు అదుపులో ఉన్నాయని, సైబర్ క్రైమ్స్ దేశంలో అన్ని రాష్ట్రాల్లో పెరుగుతున్నట్టే మనకు కూడా పెరుగుతున్నాయని, వీటి నియంత్రణ కోసం జిల్లాకి ఒక్కో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. టెక్నాలజీని ఉపయోగించుకోవాలననే ఉద్దేశంతో డ్రోన్స్ వాడుతున్నామని, క్రైమ్ డిటెక్షన్ లో సిసి ఫుటేజ్ ఆధారాలు చాలా కీలకపాత్ర పోషిస్తాయని, వీటి కోసం రాష్ట్రంలో ప్రైవేటుగా అనేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, రాబోయే రోజుల్లో ఇంకా ఎక్కువగా ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. ప్రెస్ కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ కార్యాలయంలో నందు నూతనంగా నిర్మించిన ఆయుధ భాండాగారమును ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏలూరు రేంజ్ ఐజిపి అశోక్ కుమార్, కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణ రావు, ట్రైనీ ఎఎస్పీ కుమారి సుష్మిత, మరియు కాకినాడ జిల్లాలోని అందరు అధికారులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధిపై సర్వేను పర్యవేక్షించిన అధికారులు

**యాడికి: జనవరి 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు సోమవారం కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే చేపట్టారు. డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ రామచంద్ర, సూపర్వైజర్ రాంప్రసాద్ గౌడ్ కుష్టు వ్యాధిపై సర్వేలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ రామచంద్ర మాట్లాడారు. ఫిబ్రవరి రెండో తేదీ వరకు సర్వే చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ పరమేష్ పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి సైన్స్ ప్రయోగాల వీడియో పోటీలు

**ఇబ్రహీంపట్నం, జనవరి 20 (వార్తా ప్రభ ప్రతినిధి):-** విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, సైన్స్ సిద్ధాంతాలు మెరుగ్గా అర్థం చేసుకోవడం, చదువులో ఆత్మవిశ్వాసం పెరగడానికి సైన్స్ ప్రయోగాల వీడియో పోటీలు తోడ్పడతాయని జేవీవీ జిల్లా అధ్యక్షుడు వి.మురళీమోహన్, కొండపల్లి గౌరవాధ్యక్షుడు డాక్టర్ మామిడి సీతారామారావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక కొండపల్లి పట్టణ కమిటీ సమావేశం స్థానిక డాక్టర్ మోహన రావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి బాలలు రేపటి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు పాఠశాలలో చేసే చిన్న చిన్న ప్రయోగాలే పునాది అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జనవిజ్ఞాన వేదిక గత మూడేళ్ల నుంచి సైన్స్ ప్రయోగాల వీడియో పోటీలు నిర్వహిస్తుందని చెప్పారు. విద్యార్థులు స్వయంగా ప్రయోగాలు చేయడం ద్వారా ఆలోచన నైపుణ్యాలు, క్లిష్టమైన సమస్యల పరిష్కారం సాధ్యమవుతాయన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం - సుస్థిర అభివృద్ధి, మూఢ నమ్మకాలు - శాస్త్రీయ దృక్పథం వంటి ప్రయోగ అంశాలపై వీడియోలను ఫిబ్రవరి 15వ తేదీలోపు పంపాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9398524988 నంబర్ లో సంప్రదించాలని సూచించారు.



అనంతరం జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ముద్రించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రయోగాల వినూత్న పోటీలు - 2025 కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, ఎస్.నాగరాజు, ఎస్.కె.సర్దార్ సాహెబ్, బి.డేవిడ్ రాజు, సిహెచ్.మురళి తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**-సిడిపివో కె.పుష్పలత**

**మైలవరం అంగన్వాడీ స్కూల్ - 2 లో గర్భిణీలకు సామూహిక సీమంతాలు**



**మైలవరం :జనవరి 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందుతారని ఐసిడిఎస్ మైలవరం ప్రాజెక్టు సిడిపివో కె.పుష్పలత అన్నారు. విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మైలవరం పట్టణంలోని దేవుని చెరువు ఏరియా అంగన్వాడీ కేంద్రం-2 ఆవరణ లో సోమవారం గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతాలు నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిడిపివో పుష్పలత మాట్లాడుతూ 1000 రోజులల సంరక్షణ అనగాం గర్భవతి అయినప్పటి నుంచి పుట్టిన బిడ్డకు 2 సంవత్సరాలు పూర్తయ్యే వరకు గల మధ్య కాలాన్ని 1000 రోజులుగా పరిగనిస్తారని తెలిపారు. ఆ సమయంలో



గర్భిణీ లు, బాలింతలు ఆకుకూరలు, పాలు, గుడ్లు, చిరుధాన్నాలు, పప్పుదినుసులు, పండ్లు ఆహారంలో భాగంగా తీసుకోవాలన్నారు తద్వారా గర్భిణీలు, బాలింతలు రక్తహీనత కు గురి కాకుండా ఉంటారని తెలియజేశారు. సూపర్ వైజర్ గౌసియా బేగం మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు మంచి పోషక విలువలతో కూడిన ఆహారం తీసపోవడం వలన ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని, పోషకాహార లోపంలేని బిడ్డ ను పొందుతారని వివరించారు. ఎం.ఎల్. హెచ్ పి. జ్యోతి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు తప్పని సరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవా లని సూచించారు. అనంతరం తల్లులకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాసిని ఛాంటబుల్ పౌండేషన్ ప్రోగ్రామ్ అసోసియేట్ శిరషా మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు అన్ని పోషక విలువలతో కూడిన ఆహారం తింటూ ఆరోగ్యంగా ఉండాలని, పోషకాహారంతో పాటు వైద్యులను సంప్రదిస్తూ ఉండాల ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎన్.ఎం ఆశా కార్యకర్తలు పాల్గొన్నా రు.

## ఆంధ్రప్రదేశ్ క్రీడ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిమిని రవి నాయుడు, శాప్ ఎండీ పిఎస్ గిరీషా ను కలిసిన శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



**జగ్గయ్యపేట జనవరి 20 (వార్తప్రభ)**విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నందు స్పోర్ట్స్ అథారిటీ శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు మరియు ఎండి పిఎస్ గిరీషా ని శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర కలవడం జరిగింది. ఈ సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలో ఉన్న స్విమ్మింగ్ పూల్ ను మున్సిపాలిటీకి ఇవ్వాలని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ని కోరారు. జగ్గయ్యపేటలో ఉన్న రెండు శాప్ క్రీడ ప్రాంగణాలను అభివృద్ధి చేస్తామని, సౌకర్యాలు మెరుగుపరుస్తామని, కావలసిన వసతులన్నీ కల్పించడానికి అధికారుల బృందాన్ని రేపు పర్యవేక్షణకు పంపిస్తామని వారు వచ్చి వారి నివేదిక సమర్పించినాక అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలో జగ్గయ్యపేట ప్రాంతం నుంచి అత్యుత్తమ క్రీడాకారులను తయారు చేసే బాధ్యత, వారికి వసతులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని శాప్ చైర్మన్ మరియు ఎండి మాట ఇవ్వడం జరిగింది.



## పేకాట స్థావరంపై దాడులు.. 8 మంది అరెస్ట్

**యాడికి: జనవరి 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**యాడికి మండలం గుడిపాడు గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై సోమవారం సీఐ ఈరన్న ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్కడ పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 24, 200ల నగదుతో పాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎస్ఐ రమణ పాల్గొన్నారు.

## ముమ్మరంగా జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియ





**విజయవాడ పశ్చిమ జనవరి 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల నూతన భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్ నందు జరుగుతున్న బీఫామ్ పట్ట రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరం గా జరుగుతోందని ఇన్చార్జ్ కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ తెలిపారు. పాయికాపురం, కొత్త రాజరాజేశ్వరి పేట లో 10 సంవత్సరాలు నిండిన ఇంటి యజమానులకు బి ఫాం పట్టాను పక్క రిజిస్ట్రేషన్ చేసేందుకు విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతుందని, ఇంకాను రిజిస్ట్రేషన్ జరగవలసినవి 1171 ఉండగా, అందులో 371 రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారని తెలిపారు. ఇంకా ఎవరైతే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చెయ్యాలో త్వరగా పూర్తిచేసుకుని ప్రభుత్వం వారు కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ప్రజలను కోరారు.

## గొర్రెల పెంపకం దారులకు లబ్ధి చేకూర్చడమే టిడిపి ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి**





**కనిగిరి జనవరి 20 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం కనిగిరి పట్టణంలో సోమవారం కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గొర్రెల మండిని ప్రారంభించారు. ప్రకాశం జిల్లాలో 20 లక్షల గొర్రెల సంతతి ఉంటే అందులో ఒక్క కనిగిరి నియోజకవర్గం లోనే ఐదు లక్షల గొర్రెలు, మేకల సంతతి ఉందంటున్నారు. గొర్రెల పెంపకం దారులకు లబ్ధి చేకూర్చేందుకు కనిగిరిలో గొర్రెల మండిని ఏర్పాటు చేయడం జరిగిందని, గతంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర శాసనసభ్యునిగా గొర్రెల మండిని నిర్మిస్తే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా నాయకులు దానిని నిర్వీర్యం చేశారని అన్నారు. ఈ ప్రాంత గొర్రెల పెంపకం దారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గొర్రెల మండిని ప్రారంభించడం జరిగిందని, త్వరలో మాంసం ఫ్యాక్టరీని కనిగిరిలో నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## సార్ధకం చేసుకున్న చిన్నరాజు జీవితం

**ఒకే సారి 200 మంది వేద పండితుల ఆశీర్వచనాలు**





**హనుమాన్ జంక్షన్, జనవరి 20(వార్తాప్రభ)**మహొన్నత వ్యక్తి, మహా మనిషి కనుమూరి సూర్యనారాయణ రాజు ( చిన్నరాజు గారి ) దశదిన కర్మ సోమవారం హనుమాన్ జంక్షన్ లో ఘనంగా జరిగింది. కుటుంబ సభ్యులు ఉదయం నుంచి కుమారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 200 మంది వేద పండితులకు, అర్చకులకు స్వయం పాకం , సంభావన అందించారు. చిన్న రాజు పేరు మీద గోవును దానం చేశారు. పెళ్లి ఇంటిని తలపించేలా పూల అలంకరణ చేశారు. రాష్ట్రం లోని వేర్వేరు ప్రాంతాల నుంచి ఈ కార్యక్రమానికి బంధువులు స్నేహితులు అభిమానులు తరలివచ్చారు. పెద్ద కర్మ కార్యక్రమానికి లారీ ఒనర్స్ వర్కర్స్ , డ్రైవర్స్ యూనియన్ తో పాటు పలు గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి నివాళులు అర్పించారు.

## చెట్లు నరికివేతపై ఆర్ అండ్ బి ఏ ఈ ఫిర్యాదు

**విస్సన్నపేట జనవరి 20(వార్తాప్రభ)**స్థానిక మండల కేంద్రంలో సత్తుపల్లి రోడ్డులో ఆర్ అండ్ బి పరిధిలోని చెట్లు నరికివేతపై ఆర్ అండ్ బి ఏఇ గాయత్రి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.



# అంబేద్కర్ ను గౌరవించని మనువాదులు

**- రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం - అమిత్ షా రాజీనామా చేయాలి -సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ - గో బ్యాక్ అమిత్ షా - వామ పక్ష నేతలు**

**విజయవాడ, జనవరి 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను గౌరవించుకుంటూ, మనకందించిన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ పిలుపునిచ్చారు. వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్ ధర్నా చౌక్ వద్ద బి ఆర్ అంబేద్కర్ పై పార్లమెంట్ లో అవమానించిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా నగరంలోకి విచ్చేసిన సందర్భంగా, వ్యాఖ్యలకు నిరసనగా సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, సీపీఎం జిల్లా నాయకులు డోనేపూడి కాశీనాథ్ అధ్యక్షతన "గో బ్యాక్ అమిత్ షా" అంటూ నినాదాలతో జరిగిన నిరసన కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ దేశ చరిత్రలో లేని విధంగా, సాక్షాత్తు పార్లమెంటులో అంబేద్కర్ ను అవమానించే విధంగా దిగజారి మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షాను వెంటనే రాజీనామా చేయించాలని, లేదా బర్త్ రఫ్ చేయాలని ప్రధాని నరేంద్ర మోడీని ఆయన డిమాండ్ చేశారు. స్వాతంత్ర ఉద్యమం, రాజ్యాంగం పైన, రచించిన బిఆర్ అంబేద్కర్ పై గౌరవం, విశ్వాసం లేని బిజెపి నాయకులు పదే పదే కించపరిచే విధంగా మాట్లాడటం దారుణం అన్నారు. 2024 ఎన్నికల సందర్భంలో పార్లమెంటులో 400 స్థానాలు ఇస్తే, భారత రాజ్యాంగాన్ని మార్చేస్తామని బిజెపి సీనియర్ నాయకులు అనంత వెంకయ్య చాలా స్పష్టంగా ప్రకటించారని గుర్తు చేశారు. బిజెపి మాతృ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ 1949 నవంబర్ నెల ప్రచురించిన ఎడిషన్ లో మాకు లౌకిక రాజ్యాంగం నచ్చదని, మను స్మృతి ఆధారంగా రాజ్యాంగం ఉండాలని, హిందూ మతప్రాతిపదికన దేశం నడవాలని తమ అభిప్రాయాన్ని చెప్పారని తెలిపారు. వీరూ రాజ్యాంగం లేకుండానే అధికారంలోకి వచ్చారా...? అని బిజెపి నాయకులను ప్రశ్నించారు. రాజ్యాంగం అమలులో ఉంది కాబట్టే, పదవుల్లో ఉన్నారని హితవు పలికారు. దేశమంతా అమిత్ షా వ్యాఖ్యలపై ఖండిస్తుంటే, మన రాష్ట్రంలో అమిత్ షా వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు



జగన్మోహన్ రెడ్డి ఇప్పటివరకు ఖండించకపోవడం దారుణమన్నారు. దాగుడుమూతలు ఆడకుండా అమిత్ షా వైఖరిని ఖండించాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తాననే పవన్ కళ్యాణ్ కేంద్ర మంత్రి అమిత్ షాను రాజీనామా చేయించాలని, లేదా నరేంద్ర మోడీని ఒప్పించి బర్తరఫ్ చేయించాలని కోరారు. లేనిపక్షంలో అమిత్ షా రాజీనామా చేసేంతవరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని హెచ్చరించారు. మహనీయుడు అంబేద్కర్ ను గౌరవించుకునేందుకు, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు జరిగే కార్యక్రమాలలో దేశాభిమానులు, శ్రేయోభిలాషులంతా పాల్గొవాలని పిలుపునిచ్చారు. సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మోడీ ఆధ్వర్యంలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అంబేద్కర్ ను అవమానిస్తూ మాట్లాడుతుంటే పార్లమెంటులో బిజెపి పెద్దలంతా బల్లలు చరిచారని, దీనిని గమనిస్తుంటే మోడీ భజన చేస్తున్నారని తెలుస్తుందని విమర్శించారు. రాముడు భజన చేస్తే మోక్షం కలుగుతుందని వీరికి హితవు పలికారు. మోడీ కన్నా అంబేద్కర్ చిన్నవాడా..? అని ప్రశ్నించారు. వీరికి మనువాదం తలకెక్కిందని దుయ్యబట్టారు. నాడు స్వాతంత్ర పోరాటంలో సామ్రాజ్యవాదులతో పోరాడి, త్యాగాలు చేస్తే, అదే సందర్భంలో వాజ్ పాయ్ బ్రిటిష్ వారికి లొంగిపోయి సిపాయిలతో పని చేస్తానని చెప్పిన సందర్భాన్ని గుర్తు చేశారు. గాంధీని చంపిన సనాతన హిందువు గాడ్సే కు డి కట్టాలనుకోవడం నిజం కాదా ..? అని ప్రశ్నించారు. కమ్యూనిస్టుల చరిత్ర అజరామరమని తెలిపారు. పార్లమెంట్ లో అంబేద్కర్ పై అవమానకర వ్యాఖ్యలు చేసిన అమిత్ షా ను రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు.సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు డి హరినాథ్, పోలారి, ఎం సీపీఐ యు ఖాదర్ భాష, సీపీఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ వీరు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ ను పార్లమెంట్ లో అవమానించిన కేంద్ర హెూంమంత్రి అమిత్ షాను వెంటనే బర్త్ రఫ్ చేయాలని నరేంద్ర మోడీని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ పార్లమెంట్ లో జరిగిన దుర్మార్గ సంఘటన బి ఆర్ అంబేద్కర్ ను అవమానించిన అమిత్ షా ను నరేంద్ర మోడీ ఖండించకపోవడం అత్యంత దారుణం అన్నారు. భారతదేశంలో పాలకవర్గాలు విశాల మనస్తత్వం కలిగి ఉండాలని హితవు పలికారు. వెంటనే అమిత్ షాను రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. ఈ వామపక్షాల నిరసనలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవీంద్రనాథ్, కే రామాంజనేయులు, నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్ బాబు, ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి బి. నా సర్ జి, నగర పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు , పంచదారల దుర్గాంబ, కొట్టు రమణారావు, ఓర్సు భారతి, నగర నాయకులు తూనం వీరయ్య,ఏ ఆర్ ఆంజనేయులు, కే ఆనందరావు, రామస్వామి, దుర్గాసి రవణమ్మ, సీపీఎం మాజీ కార్పొరేటర్ కె శ్రీదేవి, నాయకులు సిహెచ్ సుప్రజ, ఆంద్ర మాల్యాద్రి, పి ఓ డబ్ల్యు నేత పద్మ, తదితర వామపక్ష నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జగ్గయ్యపేట నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు, సమస్యలపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ని కలిసి వినతిపత్రం ఇచ్చిన శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)



**జగ్గయ్యపేట జనవరి 20 (వార్తప్రభ)**నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు, సమస్యలపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ని కలిసి వినతిపత్రం ఇచ్చిన శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య నియోజక వర్గంలో డీమఫ్ ఫండ్స్ విడుదల చేయాలని కోరడం జరిగింది. జగ్గయ్యపేట పట్టణం, విలియం పేట రోడ్డులో ఉన్నటువంటి డంపింగ్ యార్డ్ స్థలాన్ని మార్చడం లేక దుర్గంధపు వాసన రాకుండా శాశ్వత పరిష్కారం చేయాలని కలెక్టర్ ని కోరడం జరిగింది. నియోజకవర్గంలో ఉన్నటువంటి సీలింగ్ ల్యాండ్ లు వివరములు తాసిల్దార్ ఆఫీస్ నందు ఉంచవలెనని, సీలింగ్ లో ఉన్నటువంటి ల్యాండ్ లు మరియు కోర్టులో ఉన్నటువంటి ల్యాండ్ లు కూడా కొందరు వ్యక్తులు ఆక్రమించుకొని అనుభవించడం జరుగుతుందని అట్టి వాటిని అరికట్టి ఆ సమస్యలు త్వరగా పరిష్కరించవలసిందిగా కోరడం జరిగింది. జగ్గయ్యపేట పట్టణంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ గారిని కోరడం జరిగింది.జగ్గయ్యపేట పట్టణంలో ఐటీ పార్క్ ఏర్పాటు చేయాలని గౌరవ కలెక్టర్ ని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్ నకరకంటి వెంకట్, నోముల రఘు తదితరులు ఉన్నారు.

## ఆర్జీల పరిష్కారానికి అధికారులు తొలి ప్రాదాన్యత ఇవ్వండి..

**జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 144 అర్జీలు**
**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ జనవరి 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా అందిన అర్జీలను నిర్దేశ గడువులోగా పరిష్కరించే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్వో ఎం.లక్ష్మి నరసింహం, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి పి.జ్యోతి తదితరులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 144 అర్జీలురాగా వీటిలో రెవెన్యూకు సంబంధించి 43, ఎంఏయూడీకి సంబంధించి 60, పోలీస్ 8, పంచాయతీరాజ్ 7, సర్వే 4, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 3, ఉపాధి కల్పన 2, అటవీ 2, హెల్త్ 2, హౌసింగ్ 2, ఇరిగేషన్ 2, ఏపీసీపీడీసీఎల్ 1, ఏపీఎస్ఆర్టీసీ 1, సిఇవో జిల్లా పరిషత్ 1, కో%-%ఆపరేటివ్ 1, పౌర సరఫరాలు 1, డ్వామా 1,విద్యా 1, గనులు అండ్ భూగర్భ శాస్త్రం 1, సోషల్ వెల్ఫేర్ 1, చొప్పున అర్జీలు వచ్చాయి. ఈ అర్జీలను నిర్దేశ గడువులోగా పరిష్కరించేందుకు కృషిచేయాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. వీటితో పాటు అన్‌లైన్‌లోను నమోదు అవుతున్న అర్జీలను ప్రతి రోజు పరిశీలించి పెండిరగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. గడువులోగా పరిష్కారం కాని వాటికి తగిన కారణాలను అర్జీదారునికి వివరించాలన్నారు. గడువుతీరిన అర్జీల పెండిరగ్ ఏ శాఖలోను నమోదు కాకూడదని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# క్రీడల్లో ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టాలి

**● శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ● జగ్గయ్యపేటలో క్రీడల అభివృద్ధిపై ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌తో చర్చ ● జాతీయపోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు శాప్ ఛైర్మన్ అభినందన**

**విజయవాడ:జనవరి 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ నుంచి ఖేలో ఇండియా, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఏపీకి అత్యధిక పతకాలు సాధించి క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలబెట్టాలని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. జనవరి 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలోని లడక్‌లో జరిగే 5వ ఎడిషన్ ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌లో భాగంగా ఏపీ నుంచి పాల్గొనే 20 మంది ఐస్ స్కేటింగ్ క్రీడాకారులు విజయవాడలోని శాప్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు గారిని సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఐస్ స్కేటింగ్ కాంపిటేషన్‌కు సంబంధించి తీసుకున్న శిక్షణ, గతంలో సాధించిన విజయాల గురించి శాప్ ఛైర్మన్‌కు క్రీడాకారులు వివరించారు. ఐస్ స్కేటింగ్ క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి కల్పించాల్సిన మౌలిక వసతులు, ప్రోత్సాహకాలను అందజేస్తామని, కాంపిటేషన్‌లో అత్యధిక పతకాలు సాధించి రాష్ట్ర కీర్తిప్రతిష్టతలను దేశవ్యాప్తంగా విస్తరింపచేయాలని శాప్ ఛైర్మన్ ఆకాంక్షించారు.

**జూడో క్రీడాకారులకు అభినందన..**గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో గత డిసెంబర్ 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ జరిగిన క్యాడెట్ స్టేట్ జూడో టోర్నమెంటులో పసిడి పతకం కైవసం చేసుకున్న జూడో క్రీడాకారులు ఎన్టీఆర్ జిల్లా డీఎస్డీఓ అజీజ్ గారితో కలిసి శాప్ ఛైర్మన్ రవినాయుడు గారిని విజయవాడలోని శాప్ కార్యాలయంలో సోమవారం కలిశారు. మహారాష్ట్రలోని పూణేలో ఈనెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ జరిగే క్యాడెట్ బాయ్స్ అండ్ గర్ల్స్ నేషనల్ జూడో ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్నట్లు శాప్ ఛైర్మన్ గారికి వారు తెలియజేశారు. ఈ సందర్భంగా జూడో క్రీడాకారులను రవినాయుడు గారు అభినందించడంతోపాటు ఏపీకి అత్యధిక పతకాలు సాధించాలని సూచించడం జరిగింది.

**యోగా క్రీడాకారుడికి అభినందనలు..**యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ సింగపూర్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ



సింగపూర్‌లో జరిగిన ఏషియన్ యోగా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ జూనియర్స్ విభాగంలో భారత్ తరుపున ప్రాతినిధ్యం వహించి ప్రథమస్థానం సాధించిన తాడేపల్లికి చెందిన డి.ధీరజ్ శ్రీకృష్ణ ఈరోజు విజయవాడలోని శాప్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు



గారిని కలిశారు. ఈ సందర్భంగా ధీరజ్ శ్రీకృష్ణను శాప్ ఛైర్మన్ అభినందించి భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని సూచించడం జరిగింది.

**జగ్గయ్యపేట స్టేడియంలో స్విమ్మింగ్‌పూల్ అభివృద్ధి చేయాలి..**జగ్గయ్యపేటలోని క్రికెట్ స్టేడియంలో వాటర్ లీకేజీ సమస్యలను పరిష్కరించి స్విమ్మింగ్‌పూల్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడుకి జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), జగ్గయ్యపేట మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ రవినాయుడుని సోమవారం వారిరువురూ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ జగ్గయ్యపేటలోని స్టేడియంలో వాటర్ ట్యాంకుకు లీకేజీలు ఏర్పడి క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వాటర్ ట్యాంక్, స్విమ్మింగ్‌పూల్‌ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని మున్సిపాలిటీ అధికారులను కోరగా స్టేడియం మున్సిపాలిటీ పరిధిలోకిరాదని వివరించారన్నారు. కావున క్రికెట్ స్టేడియంలో వాటర్ ట్యాంక్ లీకేజీ సమస్యను, స్విమ్మింగ్‌పూల్ మరమ్మతులకు శాప్ చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై శాప్ ఛైర్మన్ రవినాయుడు స్పందిస్తూ జగ్గయ్యపేటలోని స్విమ్మింగ్‌పూల్ అభివృద్ధికి తక్షణమే చర్యలు తీసుకోవాలని, స్విమ్మింగ్‌పూల్ మరమ్మతులకు సంబంధించి శాప్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి అంచనాలను తయారుచేసి జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పెట్టాలని ఎన్టీఆర్ జిల్లా డీస్డీఓను ఆదేశించారు. అలాగే జగ్గయ్యపేటలో క్రీడావసతుల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌ను శాప్ ఛైర్మన్ ఆకాంక్షించారు.

**జాతీయ పోటీల్లో ఏపీ సత్తా చాటాలి– శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు**

ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఈనెల 28నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకూ జరిగే 38వ జాతీయ క్రీడాపోటీల్లో ఏపీ క్రీడాకారులు సత్తాచాటాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆకాంక్షించారు. విజయవాడ గుణదలలోని ఓల్గా ఆర్చరీ అకాడమీలో ఓల్గా ఆర్చరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ చెరుకూరి సత్యనారాయణ



ఆధ్వర్యంలో నిర్వహించిన కోచింగ్ క్యాంపును శాప్ ఛైర్మన్ సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా 38వ జాతీయస్థాయి పోటీల్లో ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించనున్న ఆర్చరీ క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకుని అభినందనలు తెలియజేశారు. అనంతరం కృష్ణానదిలో ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీచ్ కబడ్డీ కోచింగ్ క్యాంపును శాప్ ఛైర్మన్ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులతో మాట్లాడుతూ జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచి ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టాలన్నారు. క్రీడాకారుల భవిష్యత్తే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం నూతన స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చిందని, ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో స్పోర్ట్స్ కోటాను 2శాతం నుంచి 3శాతానికి పెంచిందని, క్రీడాప్రోత్సాహకాలను భారీగా పెంచిందని వివరించారు. ఏపీ నుంచి అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు గారు కృషి చేస్తున్నారన్నారు. దానికి అనుగుణంగా క్రీడాకారులకు ప్రయోజనకరంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడావసతులను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. క్రీడాకారుల భవిష్యత్తు రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతని, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో అత్యధిక పతకాలు సాధించి రాష్ట్ర కీర్తిప్రతిష్టతలను విస్తరింపజేయాల్సిన బాధ్యత క్రీడాకారులపైనే ఉందన్నారు.

**గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో..**ఉత్తరాఖండ్‌లో ఈనెల 28వ తేదీ నుంచి జరిగే 38వ జాతీయ పోటీలకు సిద్ధమవుతున్న అథ్లెటిక్స్ మోడ్రన్ పెంటాథ్లన్ క్రీడాకారులను శాప్ ఛైర్మన్ రవినాయుడు గారు సోమవారం కలిసి అభినందించారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు నిర్వహిస్తున్న కోచింగ్ క్యాంపును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో ఆయన మాట్లాడుతూ 38వ జాతీయస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శనే లక్ష్యంగా, ప్రథమస్థానమే ధ్యేయంగా క్రీడాకారులు రాణించాలని సూచించారు. ఏపీకి అత్యధిక పతకాలు సాధించి దేశ వ్యాప్తంగా రాష్ట్ర కీర్తిప్రతిష్టతలను ఇనుమడింపచేయాలన్నారు. క్రీడాకారుల భవితకు రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, దానికి అనుగుణంగా క్రీడల్లో ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి చేయాలని శాప్ ఛైర్మన్ ఆకాంక్షించారు.

## ఐఐటి సీటు సాధించిన విజ్ఞాన్ విద్యార్థిని




**జగ్గయ్యపేట జనవరి 20 (వార్తప్రభ)**2023-24 విద్యాసంవత్సరం లో 10వ తరగతి 553 మార్కులతో పూర్తి చేసిన విజ్ఞాన్ విద్యాసంస్థ విద్యార్థిని మూడావతు వెన్నెల ఐఐటి ఇడుపులపాయ బ్రాంచి లో సీటు సాధించటం ఎంతో గర్వకారమని జగ్గయ్యపేట వైస్సార్సీపీ ఇంచార్జి తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో శాలువా, మెమెంటో మరియు పుష్పగుచ్చంతో సత్కరించి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని దీవించారు. స్కూల్ డైరెక్టర్ శ్రీమతి తన్నీరు సుధారాణి మాట్లాడుతూ ఐఐటి స్థాపించినప్పటి నుండి మా విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు ప్రతి సంవత్సరం సీట్లు సాధిస్తున్నారని, మా విద్యాసంస్థ ఎన్ సి సి కలిగి ఉండటం వలన ఇటువంటి ప్రతిష్ఠాత్మక సీట్లు సాధించటం సులువు అవుతుందని తెలిపారు.

## జాతీయ సమైక్యత చాటి చెప్పేలా గణతంత్ర వేడుకల ఏర్పాట్లు..

**76వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేలా ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలి.- జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సిపి పి. రాజేశేఖర్‌బాబు.**





**విజయవాడ:జనవరి 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జాతీయ సమైక్యత చాటి చెప్పేలా గణతంత్ర వేడుకలను నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సిపి బి. రాజేశేఖర్‌బాబు తెలిపారు.ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న 76వ గణతంత్ర వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సిపి పి. రాజేశేఖర్‌బాబులు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ సమైక్యత ఉట్టిపడే విధంగా వేడకలకు ఏర్పాట్లు పూర్తి చేసి పరేడ్‌కు సిద్ధంగా ఉంచాలన్నారు. గౌరవ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పతాకావిష్కరణ చేస్తారన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు, మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, సీనియర్ ఐఎఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొనే గణతంత్ర వేడుకలకు తగిన విధంగా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రధాన వేదిక, వివిఐపి, విఐపి గ్యాలరీలలో ప్రోటోకాల్ అనుసరించి సిటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. వేడకలను వీక్షించేందుకు విచ్చేసే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రాంగణాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు కలెక్టర్ సూచించారు. గణతంత్ర వేడుకలలో పాల్గొనే కంటెంజెట్ విభాగాల ప్రదర్శనలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రగతిని చాటేలా వివిధ శాఖల అలంకృత శకటాలను ముందుగానే సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. వేడుకల విశేషాలను ఎప్పటికప్పుడు అందించే వాఖ్యాతలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్సును కలెక్టర్ పరిశీలించి తగు సూచనలు చేశారు. విద్యుత్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా జనరేటర్లను అందుబాటులో ఉంచాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య సిబ్బందితో మెడికల్ క్యాంపును, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలన్నారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న గణతంత్ర వేడుకలను విజయవంతం చేయడంలో అధికారులు ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధతో ఎటువంటి లోటు పాట్లకు తావులేకుండా శాఖల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సూచించారు. నగర పోలీస్ కమీషనర్ పి. రాజశేఖర్ బాబు మట్లాడుతూ వేడుకలలో పాల్గొనేందుకు విచ్చేసే విఐపి వాహనాలకు ప్రత్యేక ప్రాక్సిమేట్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించనున్న ఇందిరాగాంధీ స్టేడియంతో పాటు పరిసరాల ప్రాంతాలు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు వేడుకల రిహార్సల్స్ నిర్వహించి ఫుల్ డ్రస్ రిహార్సల్స్‌తో పరేడ్‌ను సిద్ధంగా ఉంచలాన్నారు. వివిఐపి, విఐపిలు ఇతర ప్రజా ప్రతినిధులకు కేటాయించిన ప్రత్యేక సీట్లలో అసీనులయ్యేలా మార్గదర్శకాలను ఏర్పాటు చేయాలన్నారు. వేడుకల్లో ఆర్మీ కంటెంజెంట్ రాష్ట్ర పోలీస్ బెటాలియన్స్, ఎన్‌సిసి స్కౌట్ అండ్ గైడ్స్, పోలీస్ బ్యాండ్ వంటి విభాగాలు కవాతులో పాల్గొంటారన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని నగర పోలీస్ కమీషనర్ పి. రాజశేఖర్ బాబు తెలిపారు. ఏర్పాట్ల పరిశీలనలో డిసిపి గౌతమిషాలీ, విజయవాడ ఆర్‌డివో చైతన్య, ముఖ్యమంత్రి భద్రత అధికారులు, రాజ్‌భవన్ అధికారులు పోలీస్,ఆర్అండ్‌బి, ఐఅండ్‌పిఆర్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యుఎస్ విద్యా, వైద్య తదితర శాఖల అధికారులు ఉన్నారు.

# అంగన్వాడి సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కాగిత



**పెడన,జనవరి 20 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం గూడూరు మండలం రామరాజు పాలెం గ్రామంలో అంగన్వాడి సెంటర్ హెల్త్ కేర్ వెల్ సెంటర్ భవనాల ప్రారంభోత్సవంలో పెడన నియోజకవర్గం శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో గ్రామాలు అభివృద్ధిలో పరుగులు పెడుతుంది అని తెలిపారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు డి సి చైర్మన్ పోతన లక్ష్మీ నరసింహ స్వామి నాయుడు కార్యకర్తలు అధికారులు ఎమ్ కే బేగ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

# అనాధలకు అండ బెరాకా మినిస్ట్రీస్




**మచిలీపట్నం,జనవరి 20 (వార్తాప్రభ) :** బెరాకా.. ఒక ధైర్యం.. ఒక నమ్మకం.. ఒక విశ్వాసం. ఇవే నిరుపేదలకు, పేద విద్యార్థిని విద్యా ర్థులకు, రోగులకు, ఇల్లు లేని వారికి కొండంత వెలుగును అందిస్తున్నా యి. బెరాకా ఆశీస్సులు మనకుంటే నిశ్చిం తగా ఉండవచ్చు నన్న అభిప్రాయం కలుగుతోంది. ఎందుకంటే... బెరాకా మినిస్ట్రీ అధ్యక్షులు డా. కిరణ్ పాల్ నిరాశ్రయులైన వందలాది మందిని అనేక విధాలుగా ఆదుకుంటున్నారు. తల్లితండ్రులు లేని అభాగ్యులైన వారి నెంబర్ను చేరదీసి, చిన్నప్పటి నుంచి వారిని తీసుకొచ్చి బెరాకా హాస్టల్స్ లో ఉంచి వారికి విద్య నేర్పించడంతోపాటు క్రమశిక్షణ, ధ్యానం, ఆటలు, పాటల్లో శిక్షణనిప్పిస్తూ ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నారు. బెరాకా హాస్టల్ లో ఉండి చదువుకుంటున్న వారు వారి వారి అభిరుచులుకు అనుగుణంగా ఎంతవరకు చదువుకుంటే అంతవరకు చదివించి ఉద్యోగాల్లో స్థిరపడే విధంగా ఆదుకుంటున్నారు. ఉన్నత చదువులతో విదేశాల్లో ఉద్యోగాలు కూడా చేసుకుంటున్నారంటే అది బెరాకా కిరణ్ పాల్ ముందుచూపు వల్లే సాధ్యపడుతోంది. తమ హాస్టల్స్ లో ఉండి చదువుకుంటున్న వారినందరినీ తమ స్వంత బిడ్డల్లా చూసుకోవడమే కాకుండా వారికి వివాహాలు కూడా చేసి ఒక కుటుంబం గా తీర్చిదిద్దడం కిరణ్ పాల్ కే సాధ్యమైంది. అందుకు అన్ని విధాల కిరణ్ పాల్కు సహాయ సహకారం అందిస్తూ ప్రోత్సహిస్తూ ముందుకు నడుపుతున్న వారు శ్రీమతి కిరణ్ పాల్ కూడా ఉన్నారు. ఆదివారం రాత్రి బందరు మండలం బైరాగిపాలెంలోని బెరాకా అనాధల వసతి గృహంలో చదువుకుని పెద్దవారైన విద్యార్థిని విద్యార్థులైన రమ్య, కార్తీక్ లకు తమ సొంత బిడ్డల్లా కిరణ్ పాల్ దంపతులు అత్యంత ఘనంగా అందరూ మెచ్చే విధంగా వివాహం జరిపించారు. బెరాకా హాస్టల్లో నిర్వహించిన వివాహానికి మత పెద్దలు మేక విజయరాజు, నాగిశెట్టి డానియల్ తదితరులతో పాటు పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు నగర ప్రముఖులు పాల్గొని కొత్త జంటను ఆశీర్వదించి కిరణ్ పాల్ దంపతులను అభినందించారు.

# ఏరోబిక్ గురువు నూరుద్దీన్ ను అభినందించిన ఎమ్మెల్యే సౌమ్య



**నందిగామ,జనవరి 20 (వార్తాప్రభ) :** నేటి యు-వతకు నూరుద్దీన్ రోల్ మోడల్ గా నిలబడి రానున్న రోజులలో అనేక విజయాలు సాధించాలని మరింత ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య ఆకాంక్షించారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఇటీవల హైదరాబాదులో జరిగిన కలెక్షన్ ఆఫ్ ఎక్సర్సైజ్ ప్రొఫెషనల్ ఆఫ్ ఇండియా అవార్డును అందుకున్న ఏరోబిక్ గురువు మహమ్మద్ నూరుద్దీన్ ను ఎమ్మెల్యే సౌమ్య శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ29 రాష్ట్రాలలో కలెక్షన్ ఆఫ్ ఎక్సర్సైజ్ ప్రొఫెషనల్ ఆఫ్ ఇండియా అవార్డును గెలుచుకున్న మొట్టమొదటి వ్యక్తి నూరుద్దీన్ కావటం మన నందిగామ అదృష్టం అన్నారు. మన దేవినేని వెంకటరమణ క్రీడా ప్రాంగణంలో ఏరోబిక్ నేర్పిస్తూ అదే విధంగా ఆరోగ్యమే మహాభాగ్యంగా వ్యాయామం నేర్పిస్తూ కూడా జాతీయస్థాయిలో ఎన్నో అవార్డులను అందుకున్నారన్నారు 2022 ఢిల్లీలో జరిగిన కాంపిటీషన్ ఎక్సర్సైజ్ ప్రొఫెషనల్ ఆఫ్ ది ఇయర్ అవార్డు మరియు లిమ్ కా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ స్థానం పొంది ఎన్నో కీర్తి ప్రతిష్టలను పొందిన నూరుద్దీన్ నిజంగా అభినందనీయులని సౌమ్య కొనియాడారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తరపున క్రీడలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను చేసేందుకు తనవంతుగా కృషి చేస్తానని సౌమ్య హామీ ఇచ్చారు. అదేవిధంగా పట్టణంలోని పలువురు పెద్దలు నూరుద్దీన్ అభినందించారు.

# నిరుద్యోగులకు శుభవార్త

● 12 నెలలు శిక్షణ ఇచ్చి ఉద్యోగం ● కమిషనర్ ఈవి రమణబాబు



**నందిగామ ,జనవరి 20 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి ప్రధానమంత్రి ఇంటర్ షిప్ ప్రోగ్రాం కింద పురపాలక పరిధిలోని 24 సంవత్సరంలోపు నిరుద్యోగ యువతకు పదవ తరగతి అర్హతతో 12 నెలలు శిక్షణ ఇచ్చి దేశంలోనే అగ్రశ్రేణి కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని కమిషనర్ ఈవీ రమణబాబు సోమవారం తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగయువతీ యువకులు 21వ తేదీలోగా మీ సచివాలయ పరిధిలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా కమిషనర్ కోరారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు 6000/ రూపాయలు స్టైఫండ్ గా ఇవ్వబడుతుందని పేర్కొన్నారు.

# ఆయుష్మాన్ భారత్ మందిర్ కు కుర్చీలు బహుకరించిన గిరిబాబు



**హనుమాన్ జంక్షన్,జనవరి 20 (వార్తాప్రభ) :** గన్నవరం నియోజవర్గం బాపులపాడు మండల పెరికీడు గ్రామ వాస్తవ్యులు ముచ్చర్ల గిరిబాబు ఆధ్వర్యంలో పెరికీడు ఆయుష్మాన్ భారత్ మందిర్ హాస్పిటల్ సోమవారం పది కుర్చీలు బహూకరించారు. వీరి అమ్మ నాన్న ముచ్చర్ల గంగాధర రావు, మల్లేశ్వరి జ్ఞాపకార్థం ఈ కుర్చీలను బహుకరించినట్లు గిరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందూరి సత్య వేంకటేశ్వర శర్మ , తెలుగు దేశం పార్టీ నాయకులు వేగిరెడ్డి పాపారావు, కొత్తూరు ఆంజనేయులు, గొట్టాపు ప్రవీణ్, ఆరేపల్లి సుబ్బారావు, ఉప సర్పంచ్ మజ్జి దీవెన కుమార్ , మరడాని సుధ, పంచాయతీ ఇఓ మాదు రామకృష్ణ, ఆరోగ్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ తిరుపతమ్మ గోశాలకు 70 వరిగడ్డి కట్టలు విరాళం



**పెనుగంచిప్రోలు,జనవరి 20 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి గోశాలకు,తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గొండ్రియాల గ్రామానికి చెందిన రైతు బండ్ల కృష్ణారావు, శ్రీ తిరుపతమ్మ అమ్మవారి గోశాలలోని గోవులకు వరిగడ్డి కట్టలు 70 వారి సొంత ఖర్చులతో విరాళం గా సమర్పించినారు. వారికి ఆలయ డిప్యూటి కమిషనర్ మరియు కార్య నిర్వహణ అధికారి నాగ సత్య కిశోర్ కుమార్,మరియు చైర్మన్ జంగాల, శ్రీనివాస రావు ధర్మ కర్తల మండలి సభ్యులుబెజవాడ, శ్రీనివాస రావు,అభినందనలు తెలిపి అమ్మవారి ప్రసాదములు అంద చేయటం జరిగినది.

# ఎంఈఓ -1 ల సమస్యలు పరిష్కరించండి..

● విద్యా శాఖ డైరెక్టర్ కు రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం వినతి



**శ్రీకాకుళం ,జనవరి 20 (వార్తాప్రభ) :** మండల విద్యాశాఖాధికారి-1 ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి విజయ్ రామరాజు కి వినతి పత్రం సమర్పించినట్లు ఎంఈఓ 1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం తెలిపారు. సోమవారం విద్యాశాఖ డైరెక్టర్ శ్రీకాకుళం విచ్చేసిన సందర్భంగా కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళామన్నారు. ముఖ్యంగా ఎంఈఓ -1 లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలని కోరడం జరిగిందన్నారు. హై స్కూల్ హెచ్ఎం లకు, ఇతర గెజిటెడ్ అధికారులకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ ఉండగా మండలంలో దాదాపు 150 నుండి 200 మంది టీచర్లకు డి డి వో గా ఉన్న ఎంఈఓ-1 ల కు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ లేకపోవడంతో చాలా ఇబ్బందికరంగా ఉందని, ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ను కోరా మన్నారు. అదేవిధంగా ఎంఈఓ -1 లకు 2017 నుండి ఇంతవరకు బదిలీల నిర్వహించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, కావున బదిలీలు నిర్వహించాలని, జీరో సర్వీస్ తో బదిలీలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఎంఈఓ -1 లకు రెగ్యులర్ డిప్యూటీ ఈవోలుగా, జిల్లా సెక్టోరియల్ అధికారులుగా, అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లుగా పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, పాఠశాలల సందర్శన, తనిఖీలు విధులు నిర్వహిస్తున్న తమకు వాహన సౌకర్యం కల్పించాలని కోరడం జరిగిందన్నారు. అదేవిధంగా గతంలో దశాబ్దాల కిందట నిర్మించిన మండల విద్యా వనరుల కేంద్రాల (ఎం ఆర్ సి) భవనాలు దాదాపు శిథిలావస్థలో ఉన్నాయని, చాలాచోట్ల ప్రమాదకర పరిస్థితుల్లో ఎంఈఓలు, కార్యాలయ సిబ్బంది తప్పనిసరి పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నారని, కావున ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా విశాలమైన ఎం ఆర్ సి కేంద్రాల భవనాలను నిర్మాణం చేయాలని తదితర సమ-స్యలపై వినతి పత్రం అందజేశామన్నారు. తమ వినతిపై డైరెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1 సంఘ నాయకులు ధనంజయ మజ్జి, జె నారాయణస్వామి, పి జోగారావు, ఎస్ జోరాడు తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశంలో ఏం.ఈ.టి.రంగానికి ప్రపంచ స్థాయి ప్రతిభను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తోన్న "నామ్‌టెక్"




**హైదరాబాద్,జనవరి 20 (వార్తాప్రభ) :** నామ్‌టెక్ (న్యూ ఏజ్ మేకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) తమ ఇంటర్నేషనల్ ప్రొఫెషనల్ మాస్టర్స్ ప్రోగ్రామ్ స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లాస్ 2024 యొక్క మొదటి గ్రాడ్యుయేషన్ వేడుకను గాంధీనగర్‌లోని మహాత్మా మందిర్ కన్వెన్షన్ & ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించింది. స్నాతకోత్సవ వేడుక సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ 53 మంది విద్యార్థులకు పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్‌లను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా మొదటి తయారీ, ఇంజనీరింగ్ టెక్నాలజీ ఎక్స్‌పో జరిగింది, ఇది వినూత్నమైన, అత్యాధునిక డిజిటల్ టెక్నాలజీలను ప్రదర్శించింది, హాజరైన వారికి తయారీ, ఇంజనీరింగ్ యొక్క భవిష్యత్తు గురించి సమగ్ర అవగాహన కల్పించింది. ఉద్భవిస్తున్న సాంకేతికతల పట్ల ఆసక్తి కలిగించటం, అత్యాధునిక పరికరాలను ఉపయోగించడాన్ని ప్రదర్శించడం ఈ ఎక్స్‌పో లక్ష్యం అని హైదరాబాద్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఒక ప్రకటన విడుదల చేశారు. కాన్వొకేషన్, ఎక్స్‌పోకు ముఖ్య అతిథిగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మాజీ ఛైర్మన్ మరియు భారతదేశ మంగళయాన్ మిషన్ రూపశిల్పి డాక్టర్ కె రాధాకృష్ణన్ హాజరుకాగా ప్రస్తుతం నీతి ఆయోగ్ విశిష్ట సభ్యురాలు , ఇంటెల్ దక్షిణాసియా మాజీ ఉపాధ్యక్షురాలు, ఎండి, నాస్కామ్ మాజీ అధ్యక్షురాలు దేబ్జాని ఘోష్‌బి విశిష్ట హోమీ బాబా చైర్ ప్రొఫెసర్ , అణుశక్తి విభాగం డాక్టర్ కె ఎన్ వ్యాస్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. తన కాన్వొకేషన్ ప్రసంగంలో డాక్టర్ కె రాధాకృష్ణన్ మాట్లాడుతూ " తయారీ, ఇంజనీరింగ్ రంగాలకు అధిక ప్రమాణాలతో కూడిన నైపుణ్యం సాధించడంపై నామ్‌టెక్ దృష్టి సముచితం ప్రశంసనీయమన్నారు. నామ్‌టెక్ మొదటి కాన్వొకేషన్ గురించి నామ్‌టెక్ డైరెక్టర్ జనరల్ అరుణ్‌కుమార్ పిళ్లై నామ్‌టెక్ గ్రాడ్యుయేట్ల తొలి బ్యాచ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ , నేటి కంటే తెలివైన, సురక్షితమైన, న్యాయమైన భవిష్యత్తును నిర్మించడానికి మీరు సాధనాలను కలిగి ఉన్నారు. కాబట్టి ధైర్యంగా ఉండండి, ఆసక్తిని ప్రదర్శించండి , అడ్డంకులను అధిగమించి మానవాళికి సేవ చేయండి అని స్ఫూర్తిని కలిగించారు.

# శ్రీమత్ చౌడేశ్వరి దేవి జ్యోతిర్మహొత్సవముల ఏర్పాట్లు కు సన్నాహాలు



**పెడన,జనవరి 20 (వార్తాప్రభ) :** ఈనెల 10 నుండి మాఘ బహుళ పాడ్యమి ది 13 వ తేదీ గురువారం వరకు బ్రహ్మపురం శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానము నందు ఊటుకూరు ఏకనాథ్ సుధీర్ కుమార్ హేమ కనకదుర్గ నాగరాణి దంపతులచే జరుగు శ్రీమత్ చౌడేశ్వరి దేవి జ్యోతిర్మహొత్సవములు కు, పెడన పట్టణ పురపాలక సంఘ చైర్పర్సన్ కటకం నాగకుమారి ప్రసాద్ మున్సిపల్ కమిషనర్ యం గోపాలరావుచైర్ పర్సన్ ఛాంబర్ నందు మర్యాదపూ-ర్వకముగా కలిసి బ్రహ్మపురం ఉత్సవ కమిటీ వారు సోమవారం ఆహ్వాన పత్రిక అందజేసియున్నారు ఫిబ్రవరి 10 నుండి 3 రోజులు పాటు జరగబోవు ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని పెడన పట్టణ లో శానిటేషన్ ఎలక్ట్రిసిటీ పనులను మెరుగుపరచవలసిందిగా చైర్ పర్సన్ కటకం నాగ కుమారి ప్రసాద్ ను ఉత్సవ కమిటీ వారు అభ్యర్థించడం జరిగింది వారి అభ్యర్థన మేరకు చైర్ పర్సన్ వారు మున్సిపల్ కమిషనర్ శానిటేషన్ మరియు ఎలక్ట్రిషన్ పనులను మరింత పటిష్టంగా మెరుగు పరిచి అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసారు. ముందు కలిసిన వారిలో పట్టణ టిడిపి అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య తదితరులు ఉన్నారు

# చీరలు, దుప్పట్లు పంపిణీ



**విజయవాడ,జనవరి 20 (వార్తాప్రభ) :** విజయవాడ లోని గిరిపురం, ఫుట్ పాత్ ల పడుకుంటున్న నిరుపేదలైన, నిరాశ్రయులై వారికి ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ లిస్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షుడు చాట్ల విజయకుమార్ ఆధ్వర్యంలో చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. గత మూడు సంవత్సరాలుగా చలికాలంలో నిలువ నీడ కూడా లేని నిరాశ్రయులై వారు, ఫుట్ పాత్ మీద పడుకుని చలికి వణుకుతూ ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి వారికి దుప్పట్లు పంపిణీ చేయడం జరుగుతుందని, అలాగే మహిళకు చీరలు పంపిణీ చేశామని సంస్థ అధ్యక్షుడు విజయ్ కుమార్ చాట్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ కార్యదర్శి సిహెచ్ హన్న, మింటూ, మట్ట శారమ్మ, విజయవాడ సిటీ ప్రతినిధి పి. సుందరి పాల్గొన్నారు.

# సావిత్రిబాయి జ్యోతిరావు ఫూలే ఐకాన్ అవార్డ్ అందుకున్న బి యస్ నారాయణరెడ్డి




**హైదరాబాద్,జనవరి 20 (వార్తాప్రభ) :** హైదరాబాదులోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఐదవ వార్షికోత్సవము సంద ర్భంగా సావిత్రిబాయి జ్యోతిరావు పూలే ఐకాన్ అవార్డ్ ఫంక్షన్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సరోజినమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రివర్యులు శ్రీనివాస్ గౌడ్, సినీ నటులు మాణిక్ రావు, జ్యోతి స్వరూప్, డాక్టర్ సరోజినమ్మ చేతుల మీదుగా అవార్డ్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు అందుకున్నారు. సావిత్రిబాయి జ్యోతిరావు పూలే ఐకాన్ అవార్డ్ 2025 కు అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. పలు రకాల సేవా కార్యక్ర మాలు చేస్తున్నందుకు ముఖ్యంగా అనాధ శవాలకు అంత్యక్రియలు నిర్వహిం చడం , కడుపేదలైనటువంటి పేదవారికి మిగులు భోజన సౌకర్యం ఏర్పాటు చేయడం, మానవాళికి చెట్లే జీవనాధారం అని నమ్మి చెట్టు నాటే కార్యక్రమం చేపట్టడం, ప్రకృతి వ్యవసాయం గురించి అవగాహన కల్పించడం, వేరు వేరు రకాల నిరంతర సేవలో ఉన్న నన్ను గుర్తించి అవార్డ్ కు ఎన్నిక చేసినందుకు అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సరోజినమ్మకు కృతజ్ఞతలు తెలిపిన బి యస్ నారాయణరెడ్డి ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి విలే ఖరి డాక్టర్ ఖాదర్ బాషా,నేటి అమరావతి చీఫ్ ఎడిటర్ మున్నంగి చిన్న సుబ్బా రెడ్డి, బిజెపి నాయకులు సరస్వతి, సింగర్ సమ్మన్న ముదిరాజ్, దివ్య హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకులు లొక్కు శరత్,స్వచ్ఛంద సంస్థ యజమానులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలు వినియోగం పట్ల అవగాహన - ఏసీపి ప్రసాదరావు



**విస్సన్నపేట,జనవరి 20 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో సీసీ కెమెరాల వినియోగంపై ఏసీపి ప్రసాదరావు చాంబర్ ఆఫ్ కామర్స్ పరిధిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలు అన్ని పని చేసే విధంగా చూసుకోవాలని అన్నారు.పలు వ్యాపార సంస్థల అధినేతలు పాల్గొన్నారు. సీఐ గిరిబాబు ఎస్ ఐ రామకృష్ణ తదితరులు ప్రసంగించారు.

# అగ్ని బాధితులకు కిరణ్ పాల్ చేయూత



**మచిలీపట్నం,జనవరి 20 (వార్తాప్రభ) :** ఇటీవల గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడు గ్రామంలో జంగం ముసలయ్య, జంగం శ్రీనివాసరావు, నత్తా సుబ్బారావు, మాసవరపు రోశయ్య సంబంధించిన నలుగురు గృహాల దగ్గరలో ఉన్న ట్రాన్స్ఫర్మర్ షార్ట్ సర్క్యూట్ అయ్యి పూర్తిగా కాలిపోయి, కట్టు బట్టలతో ఉన్న నిరాశ్యులకు సోమవారం మినిస్ట్రీస్ అధినేత అయిన బి కిరణ్ పాల్ వారికి నిత్యవసర సరుకులు వంట పాత్రలు, భోజనం చేయుటకు ప్లేట్లు, గ్లాసులు, రెండు సోలాపూర్ దుప్పట్లు, ఒక చీర, ఒక లుంగి, ఒక కండువా, సబ్బులు, 25 కేజీల బియ్యం బస్తాలు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో పెడన పాస్టర్స్ అసోసియేషన్ వారు నాగిశెట్టి డానియల్ పాస్టరు , ఉజ్జివం పాస్టరు , శామ్యూల్ పాస్టరు తదితరులు పాల్గొన్నారు.

# కత్తుల వానిపాలెం లో రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే కాగిత



**పెడన,జనవరి 20 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం గూడూరు మండలం కంకటావ గ్రామపంచాయతీ కత్తులవానిపాలెం గ్రామంలో 34.9 లక్షలు అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణ ప్రారంభోత్సవంలో పెడన నియోజకవర్గం శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాగిత మాట్లాడుతూ గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసింది అన్నారు. అలాగే గురుజేపల్లి గ్రామంలో 21 లక్షలతో నిర్మించిన ప్రారంభించిన సిసి రోడ్లు కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డి సీ చైర్మన్ పోతన లక్ష్మీనరసింహస్వామి నాయుడు కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు గ్రామస్తుల తదితరులు పాల్గొన్నారు..

# థియేటర్లలో మౌళిక వసతులపై ఆర్డీవోకు ఫిర్యాదు



**కాకినాడ,జనవరి 20 (వార్తాప్రభ) :** సంక్రాంతి పండగ సందర్భంగా విడుదలైన భారీ చిత్రాలకు టికెట్ రేట్లు పెంచుకుని, సామాన్యుల జేబుకు చిల్లులు పెడుతున్నారని తూరంగి మాజీ ఎంపీటీసీ పితాని వెంకటరాము ధ్వజమెత్తారు. ఈ మేరకు సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదుల కార్యక్రమంలో కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. థియేటర్లలో కనీస సౌకర్యాలు కల్పించకుండా మెయింటినెన్సు చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. టాయిలెట్లలో అపరిశుభ్ర వాతావరణం నెలకొందన్నారు. థియేటర్లలో తినుబండారాల ధరలు ప్రదర్శించకుండా ఎక్కువ రేట్లు వసూలు చేసి ప్రేక్షకుల జేబుకు చిల్లులు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మూలిగే నక్కపై తాటిపండు చందంగా పరిస్థితి నెలకొందన్నారు. తినుబండారాల ధరలు ప్రదర్శించి దోపిడికి అడ్డుకట్ట వేయాలని పితాని విజ్ఞప్తి చేశారు.

# ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన జన సైనికుడు సంతోష్



**పెడన,జనవరి 20 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం గూడూరు మండల జన సేన ప్రధాన కార్యదర్శి శీరం సంతోష్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండల టిడిపి అధ్యక్షుడు డిసి చైర్మన్ పోతన లక్ష్మీనరసింహస్వామి నాయుడు జన సైనికుల పట్ల అనుసరిస్తున్న వ్యవహార శైలికి నిరసనగా తాను ఈ ఘాతుకా నికి పాల్పడినట్లు సంతోష్ చెబుతున్నాడు. శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ సోమవారం నాడు కంకటావ గ్రామంలో పర్యటించిన నేపధ్యంలో సంతోష్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా బందరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం సంతోష్ ను విజయవాడ తరలించారు.

# టి. డి.పి.నాయకులు బడుగు సోమయ్య కు ఘన నివాళి



**ఆగిరిపల్లి, జనవరి 20 (వార్తాప్రభ) :** నూజివీడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సభ్యుడు బడుగు సోమయ్య అకాల మరణానికి చింతిస్తూ వారి చిత్రపటానికి ఆగిరిపల్లి సర్పంచ్ విక్టర్ బాబు నూజివీడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు ఆగిరిపల్లి టౌన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పామర్తి నరసింహారావు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు ఘన నివాళులర్పించారు.

# విపత్కర పరిస్థితిల్లో నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఆదుకుంటాం : ఎమ్మెల్యే రాము

● గుడ్లవల్లేరు మండలంలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే..

నాలుగు బాధిత కుటుంబాలకు నిత్యవసరాలు పంపిణీ..



**గుడివాడ,జనవరి 20 (వార్తాప్రభ) :** విపత్కర పరిస్థితుల్లో నష్టపోయిన ఆపన్నులకు ప్రభుత్వ పరంగానే కాకుండా, వ్యక్తిగతంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన నాలుగు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే రాము సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాద కారణాలను రెవిన్యూ అధికారులు ఎమ్మెల్యే రాముకు వివరించారు. అనంతరం ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన రెండు ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదంలో నష్టపోయిన నత్త సుబ్బా రావు, జంగం నాగేంద్రరావు, జంగం శ్రీనివాసరావు, మాసువరపు రోశయ్య, కుటుంబాలకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే రాము వారికి నిత్యవసరాలను అందచేశారు. బాధితులకు ప్రభుత్వం నుండి అందాల్సిన పరిహారం సత్వరం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బాలాజీ, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవితో ఫోన్లో మాట్లాడారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన భరోసా కల్పించారు. నాలుగు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుండి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే రాము తెలియచేశారు. విపత్కర పరిస్థితుల్లో నష్టపోయిన అపన్నులకు, ప్రభుత్వాలు అందిస్తున్న సహకారానికి తోడు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి తమ వంతు సాయం అందించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, కొడాలి రామరాజు, వాసే మురళీ, సర్పంచ్ కటికల జ్యోతిలత, ఉప సర్పంచ్ గరికపాటి రాంబాబు, కూటమి నేతలు గరికపాటి వెంకటేశ్వరరావు, పెన్నేరు రమేష్ బాబు, మాదా శ్రీనివాసరావు, తోట చిన్నారి, పామర్తి సూరిబాబు, గుడిసెల రమేష్, కడప బాబి, కటకం కొండ, తోము వెంకటరత్నం, మల్లీ, కనకం పెద్దిరాజులు, గద్దం నిరంజన్ రావు, మండ మురళి నాంచారయ్య, తాసిల్దార్ లోకరాజు, ఎంపిడిఓ సారధి, రెవెన్యూ, విద్యుత్ శాఖ ఉద్యోగులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బహిరంగ వేలం ద్వారా దేవస్థానం కు 2 కోట్ల 31 లక్ష 40 వేల 444/ రూ. ఆదాయం..



**పెనుగంచిప్రోలు,జనవరి 20 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద పలు రకాల వ్యాపారాలను నిర్వహించుకునే లైసెన్స్ హక్కు కొరకు శుక్రవారం ఆలయ బేడ మండపం నందు ఆలయ కార్యనిర్వాణా అధికారి నాగ సత్య కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ వేలం పాటలు ద్వారా రెండు కోట్ల 31 లక్ష ,40 వేల 444 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు, దేవస్థానంలో అమ్మవారికి స్వామివారికి సమర్పించు వస్త్రములు ప్రోగు చేసుకునే హక్కునకు పి సీతారామారావు 66 లక్షలకు. దేవస్థానం కు సంబంధించిన సత్రములు నిర్వహణకు జి సుధాకర్ 49 లక్షల 15 వేల రూపాయలు దేవస్థానం ప్రాంగణం నందు పూలు పూలదండలు విక్రయించే లైసెన్స్ హక్కునకు టి సోమయ్య మూడు లక్షల 11 వేల రూపాయలు గోశాల నందు పచ్చి గడ్డి ఆకుకూరలు విక్రయించుకునే లైసెన్స్ హక్కునకు ఎల్, కోటిరెడ్డి 11 లక్షల 19,000 భక్తులచే సమర్పించబడు కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే లైసెన్స్ హక్కునకు,బోవనారి,సుబ్బారావు 24 లక్షల 50వేల రూపాయలు దేవస్థాన ప్రాంగణంలో వాహనములు పార్కింగ్ రుసుము వసూలు చేసుకునే లైసెన్స్ హక్కులకు లగడపాటి, వినయ్ 46 లక్షలు53 వేల రూపాయలు దేవస్థానం ప్రాంగణంలో మిఠాయి బొంగు బియ్యం విక్రయించుకునే లైసెన్స్ కు ఎస్ శ్రీకాంత్ 10 లక్షల పదహారువేలుకు దేవస్థానం ప్రాంగణంలో ఫోటోలు విక్రయించుకునేందుకు ఎన్ రాంబాబు 5 లక్షల 12 వేలకు దేవస్థానం ప్రాంగణంలో చిన్న తీర్థం సంరక్షణ శుభ్రపరుచుట కొరకు ఏ గోపి నాలుగు లక్షల 44 వేలకు దేవస్థానం ప్రాంగణంలో క్యాంటీన్ నిర్వహణకు కె అజయ్ కుమార్ 11 లక్షల 18 వేలకు దేవస్థానం వారు నిర్ణయించిన ధర కంటే అధిక ధరలు చెల్లించేందుకు హెచ్చు పాటదారులుగా నిలిచి హక్కులను పొందారు మొత్తం 24 రకాల వ్యాపారాలు నిర్వహించుకునే లైసెన్స్ హక్కునకు పాటలు నిర్వహించగా 10 రకాల వ్యాపారాలకు పాటలు జరిగాయి మిగిలిన వ్యాపారాలకు వ్యాపారులు ఎవరు ముందుకు రాకపోవడంతో వేలం పాటలను వాయిదా వేశారు ఈ కార్యక్రమంలో ఆలయ ఇంజనీ ర్ విభాగం ఈ ఈ,రమ ఆలయ చైర్మన్ జంగా ఎ.శ్రీనివాసరావు గ్రూప్ టెంపుల్ ఈవో ధర్మకర్తలు బెజవాడ శ్రీనివాసరావు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడ లో ఘనంగా వాకర్స్ ఫౌండర్ ఆల్వార్ దాస్ వర్ధంతి కార్యక్రమాలు





**గుడివాడ,జనవరి 20 (వార్తాప్రభ) :** సోమవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం గ్రౌండ్లో వాకర్స్ ఫౌండర్ ఆల్వార్ దాస్ గారి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుడివాడ మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొని పూలమాలలు వేశారు. నిర్వాహకులు ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డివి సత్యనారాయణ, సెక్రటరీ ఎం లక్ష్మీనారాయణ రెడ్డి, ట్రెజరర్ చలువది మోహన్ రావు, ముఖ్యఅతిథి జిల్లా గవర్నర్ సనకా సుబ్బారావు, ఎం వీరశేఖర్, సిహెచ్ మల్లిక్, పామర్తి కేశవరావు, బత్తిన శ్రీనివాస్, చిన్నం గంగాధర్ మరియు అనేక మంది వాకర్సు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తరువాత మమత వృద్ధాశ్రమానికి వెళ్లి.. అక్కడ ఉన్న వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీఎస్ ప్రసాద్ మరియు సనకా సుబ్బారావు, వీరశేఖర్, మరియు వాకర్స్ అందరూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసినందుకు అసోసియేషన్ సభ్యులకు ప్రెసిడెంట్ డి.వి. సత్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు.

**ది గుడివాడ మహిళా వాకర్స్ అసోసియేషన్ వారీ ఆధ్వర్యంలో..** సోమవారం ది గుడివాడ మహిళా వాకర్స్ అసోసియేషన్ వారీ ఆధ్వర్యంలో వాకర్స్ ఫౌండర్ ఆల్వార్ దాస్ గారి వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. స్థానిక 19వ వార్డు లోని అంగన్ వాడీ స్కూల్ నందు జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా తెలుగుదేశం పార్టీ 19వ వార్డు అధ్యక్షులు పంచుమర్తి శ్రీనివాసరావు, వాకర్స్ జిల్లా 204 ఎలక్ట్ గవర్నర్ లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు లు పాల్గొన్నారు. తొలుత ఆల్వార్ దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. తరువాత పంచుమర్తి, ఈశ్వర వెంకటేశ్వరరావు లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం. దీవెన, సెక్రటరీ వి. ప్రతిమ, ట్రెజరర్ ఎం. కృష్ణకుమారి, వైస్ ప్రెసిడెంట్ రమ్యరెడ్డి, లక్ష్మి కుమారి లు మరియు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# చిరు నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి..

● హెల్మెట్ లేని డ్రైవింగ్ క్షమించరాని నేరం - డి .టి .సి ఎ. మోహన్






**విజయవాడ,జనవరి 20 (వార్తాప్రభ) :** హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపటం క్షమించరాని నేరమని చిన్న నిర్లక్ష్యానికి నిండు ప్రాణాన్ని బలిచేసుకోవద్దని ఉప రవాణా కమిషనర్ ఎ. మోహన్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్భహించిన బైక్ ర్యాలీ ని డిటిసి ఎ మోహన్ మరియు రవాణా శాఖ అధికారులు ప్రారంభించారు ఈ సందర్భం గా డిటిసి మోహన్ మాట్లాడుతూ రహదారి భద్రతపై ప్రజలలో అవగాహన కల్పించి ప్రమాదాలను నివారించేందుకు 36 వ రహదారి భద్రతా మాసోత్సవాల నిర్వహిస్తున్నామన్నారు హెల్మెట్ వాడకంపై అవగాహన కలిగి ఉండడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ ధరించని కారణంగా నిండు ప్రాణాన్ని కోల్పోవలసి వస్తుందన్నారు. ద్విచక్ర వాహన దారులు తప్పని సరిగా హెల్మెట్ వినియోగించాలని లేదంటే జరిమానాతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో కార్లు ద్విచక్ర వాహనాలు నడిపే వాడికి సీటు బెల్టు హెల్మెట్ పై అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సీటు బెల్టు హెల్మెట్ ధరించిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రాణాల కోల్పోకుండా చేయాలన్న ఉద్దేశమే లక్ష్యం పనిచేస్తున్నామన్నారు. బైక్ హెల్మెట్ ర్యాలీ లో ఆర్టీఓ కె. వెంకటేశ్వరరావు, మోటార్ వాహన తనిఖీ అధికారులు కె. శివరాం గౌడ్, ఉదయ్ శివప్రసాద్, రవాణా ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం. రాజుబాబు కార్యాలయ సిబ్బంది, వాహన డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వ హిందూ పరిషత్ గుడివాడ శాఖ నూతన కార్యవర్గ సభ్యుల సమావేశం..



**గుడివాడ,జనవరి 20 (వార్తాప్రభ) :** విశ్వహిందూ పరిషత్ కృష్ణాజిల్లా ధర్మ యాత్ర మహా సంఘ్ సంయోజన్ శ్రీమతి జెవివి కుమారి ఆధ్వర్యంలో విశ్వ హిందూ పరిషత్ గుడివాడ శాఖ నూతన కార్య వర్గ సభ్యుల సమావేశం కొండలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా సెక్రెటరీ అల్లూరి కాంతారావు, కృష్ణాజిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు చిట్టి కుమారి, ప్రచార ప్రసార ప్రముఖ్ గరికపాటి వెంకట్రావు లు విచ్చేసారు. బజరంగ్ దళ్, గోరక్ష, సామాజిక సమరసత, మందిర అర్చక పురోహిత్ ప్రముఖ్, భగవద్గీత సంస్కృత ప్రముఖ్, ప్రచార ప్రసార ప్రముఖ్, విషెస్ సంపర్క ప్రముఖ్, సత్సంగం ప్రముఖ్, ధర్మాచార్య సంపర్క సంస్కృతి, కృష్ణాజిల్లా ధర్మ యాత్ర మహా సంఘ్ సంయోజన్, ఉత్సవాలు తీర్థయాత్రలు మహా సంఘ్ సభ్యులు హిందూ బంధువులు పాల్గొన్నారు.

# అర్ధ రాత్రి కత్తులతో ఇరువురు వ్యక్తుల వీరంగం



**పెనుగంచిప్రోలు, జనవరి 20 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం లోని అనిగండ్ల పాడు గ్రామం లో ఆదివారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో పెనుగంచిప్రోలు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కనక పూడి,భాస్కరరావు ఇంటి వద్ద ఇరువురు వ్యక్తులు కత్తులతో వీరంగం చేసిన సంఘటన తెలియ వచ్చింది. కనకబడి భాస్కరరావు పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్లో సోమవారం నాడు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన దోసపాటి చరణ్, కోట చరణ్ అనే వ్యక్తులు ఆదివారం అర్ధ రాత్రి 11 గంటల సమయంలో భాస్కరరావు ఇంటిలోనికి అక్రమంగా కత్తులతో ప్రవేశించి భాస్కర్ రావు ఇంటి తలుపుల కొడుతూ, తీవ్రమైన దుర్భాషలాలతో, బయటకు రారా నీ సంగతేలుస్తామంటూ కేకలు వేస్తూ వివరంగం సృష్టించారు. తలుపులు పెద్ద ఎత్తున కొట్టడంతో తీవ్ర ఆందోళనకు గురైన భాస్కర్ రావు దంపతులు బి గ్గరగా కేకలు వేయడంతో, ఇరుగుపొరుగు కుటుంబాలకు చెందిన వారు అక్కడకు చేరుకున్నారు. ఆ సమయంలో భాస్కరరావు ఇంటి తలుపులు తీసుకొని బయటకు రావడంతో కోటా చరణ్, దోసపాటి చరణ్ లు భాస్కర్ రావు పై దాడికి ప్రయత్నించబోయారు.భాస్కర్ రావు స్థానికులు కలిసి వారిని పట్టుకోడానికి ప్రయత్నించగా నిందితులు కత్తుల తో, బెదిరిస్తూ పారిపోయారు... భాస్కరరావు ఈ విషయాన్ని అప్పటికప్పుడు పోలీసులకు తెలియజేయగా వెంటనే స్పందించి అనిగండ్లపాడు వచ్చినిందితుల కోసం గాలించారు. వారు దొరకలేదు,ఈ విషయమై సోమవారం భాస్కర్ రావు పెనుగంచిప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# మళ్లీ జన్మ ఉంటే తెలుగుబిడ్డగానే పుడతా





(మొదటిపేజీ తరువాయి)

మర్చిపోకూడదు. ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల కోసం నాడు ఫైళ్లు పట్టుకుని తిరిగాను... కారణం మన వాళ్ళ భవిష్యత్తు కోసం.

**సుస్థిర ప్రభుత్వంతో అభివృద్ధి..** 'నాడు బిల్ గేట్స్‌ను నేను కలవాలంటే కుదరదని చెప్పారు. ఐదు నిమిషాలు సమయం కావాలని వెళ్లాను. కానీ నేను చెప్పింది వింటూ నలభై నిమిషాల సమయం ఇచ్చారు. నేను ఏమి చేయాలని బిల్‌గేట్స్ అడిగారు... మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌లో పెట్టాలని కోరాను. మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌కు రావడంతో మన తెలుగు బిడ్డ సత్యానాదెళ్ల సీఈఓ అయ్యారు. ప్రతి ఎన్నికల్లో గెలిస్తే రాష్ట్రాన్ని ఎక్కడికో తీసుకెళ్లొచ్చు. కేంద్రంలో మోదీ 3వ సారి పీఎం అయ్యారు. గుజరాత్‌లో బీజేపీ 5వ సారి గెలిచింది. 2004లో కూడా మనం గెలిచి ఉంటే తెలుగు జాతి ఊహకు కూడా అందనంత స్థాయిలో ఉండేది. కానీ అదృష్టం ఏంటంటే నా తర్వాత వచ్చిన పాలకులు హైటెక్ సిటీ కూల్చలేదు. కానీ ఏపీలో మొన్న వచ్చిన పాలకులతో అమరావతి, పోలవరం అన్నీ పోయాయి. మీ శక్తి పెరిగితే మన తెలుగు సంస్కృతి నిలబడుతుంది. మీరు, మీ పిల్లలు తెలుగులోనూ మాట్లాడాలి. అవకాశాలను వెతికిపట్టి ఏపీని వర్క్ ఫ్రం హోమ్ హబ్ గా చేయాలన్నది నా కోరిక. మహిళలు ఇంటి పనులు చూసుకుంటూనే ఐదారు గంటలు పని చేస్తే డబ్బులు సంపాదించవచ్చు. ఏఐని అందరూ అడాప్ట్ చేసుకోవాలి. విద్యుత్ రంగంలో ఊహించని పరిణామాలు రాబోతున్నాయి. గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఏపీ తయారవుతుంది. మీరు ఏపీ అభివృద్ధిలో భాగం కావాలి. నేను ఒక్క ఏపీ అభివృద్ధి గురించి మాత్రమే మాట్లాడటం లేదు... తెలుగుజాతి అభ్యున్నతి గురించి మాట్లాడుతున్నా. దేశానికి ఏదో చేయాలన్న సంకల్పంతో మోదీ పని చేస్తున్నారు. వికసిత్ భారత్ 2047తో కేంద్రం ముందుకెళ్తే... స్వర్ణాంధ్ర విజన్ 2047తో మనం ముందుకెళ్తున్నాం. మీకున్న నాలెడ్జ్‌తో నాకు సలహాలు ఇస్తే స్వీకరిస్తా. మీరు చూపించే ప్రేమ నా జీవితంలో మర్చిపోలేను. మీ ఆదరణకు నేను ఎంత చేసిన తక్కువే.' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

# రీ సర్వే సమర్ధవంతంగా నిర్వహించాలి - బందరు ఆర్డీవో కె. స్వాతి.






**ఘంటసాల: అవనిగడ్డ, జనవరి 20 (వార్తాప్రభ) :** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి చేపడుతున్న రీ సర్వేను సమర్ధవంతంగా నిర్వహించాలని బందరు ఆర్డీవో కె.స్వాతి సూచించారు. ఘంటసాల మండలం వేములపల్లి గ్రామంలో ఏపీ రీ సర్వే ప్రాజెక్టు గ్రామ సభ సోమవారం నిర్వహించారు. ఈ సభకు హాజరైన ఆర్డీవో స్వాతి సర్వే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాదానం ఇచ్చారు. అనంతరం ఆర్డీవో స్వాతి మాట్లాడుతూ వేములపల్లి గ్రామంలో 612 ఎకరాల భూములు ఉండగా మూడు బృందాలుగా సర్వే చేస్తున్నట్లు చెప్పారు. రీ సర్వేకి సంబందించి రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చిన రైతులు సర్వేలో పాల్గొనాలని, వారికి సంబందించిన పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు, ఫొటో తీసుకొచ్చి సర్వేయర్లకు అందించాలన్నారు. అనంతరం రీ సర్వే పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, రీ సర్వే డీటీ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ కె.శ్రీనివాస్, మండల సర్వేయర్ సీహెచ్. వల్లీ పుష్ప, వీఆర్వో, సర్వేయర్లు, రైతులు, పాల్గొన్నారు.

# బందరు డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రాజా




**మచిలీపట్నం, జనవరి 20 (వార్తాప్రభ) :** బందరు డిఎస్పీగా చప్పిడి రాజా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా చప్పిడి రాజా బందర్ సబ్ డివిజన్ కు డిఎస్పీగా బదిలీ అయ్యారు.బాధ్యత స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావును మర్యాదపూర్వకంగా డి.ఎస్.పి కలిశారు. బందర్ సబ్ డివిజన్ డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన చప్పిడి రాజాకు సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్సైలు. స్వాగతం పలికారు.

# నా దృష్టిలో మీరు ఎన్ఆర్ఐలు కాదు

## జ్యూరిచ్ లో ప్రవాసాంధ్రులతో లోకేశ్ సమావేశం

**విజయవాడ,జనవరి 20 (వార్తాప్రభ) :** రాష్ట్రంతో భావోద్వేగ బంధంతో పాటు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థలో ప్రవాసాంధ్రులు కీలక పాత్ర వహిస్తున్నారని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. 2023 ఆర్బీఐ డేటా ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్ఆర్ఐల ద్వారా భారతదేశంలోనే అత్యధికంగా 40,000 కోట్లకు పైగా రెమిటెన్స్‌లను అందుకుందని అన్నారు. జ్యూరిచ్ లో తెలుగు డయాస్పోరా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నా దృష్టిలో మీరు ఎన్ఆర్ఐ (MRI)లు నాన్ రెసిడెంట్ ఇండియన్స్ కాదు... అంటే మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్ (MRI) అని అభివర్ణించారు. తెలుగు ప్రవాసాంధ్రులు ఎక్కడ నివసిస్తున్నారనే దానితో సంబంధం లేకుండా తెలుగుదేశం పార్టీకి, ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారని కొనియాడారు. "ఏపీలో ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లినప్పుడు, అక్రమ అరెస్టులు జరిగినప్పుడు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో మీరు భారీఎత్తున చేపట్టిన నిరసనలను యావత్ భారతదేశం చూసింది. ఎన్ఆర్ఐలపై మాకు ప్రేమాభిమానాలు ఉన్నాయి. అందుకే గత ఎన్నికల్లో నలుగుర్ని ప్రవాసాంధ్రులను ఎమ్మెల్యేలను చేయడమేగాక, మరికొందరికి నామినేటెడ్ పదవులు కూడా ఇచ్చాం" అని లోకేశ్ వివరించారు.

**జ్యూరిచ్ లో ఉన్నానా లేక జువ్వలపాలెంలో ఉన్నానా..!** ఇక్కడ పరిస్థితులు చూస్తే నేను జ్యూరిచ్ లో ఉన్నానా, జువ్వలపాలెంలో ఉన్నానా అన్న అనుమానం కలుగుతోంది. జ్యూరిచ్ లో ఇంతమంది తెలుగువారిని ఒకేచోట కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ప్రపంచాన్ని ఏలే సత్తా తెలుగువారికి మాత్రమే ఉంది. తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది విశ్వవిఖ్యాత స్వర్గీయ నందమూరి తారకరామారావు. తెలుగువారిని ప్రపంచపటంలో నిలబెట్టింది మన విజనరీ చంద్రన్న. ఆనాడు విజన్ %-% 2020 అంటే ఎగతాళి చేశారు.



సోమవారం గుంటూరు జిల్లా, మంగళగిరిలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన గోనుగుంట్ల కోటేశ్వరరావు కి ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ల ఉద్యోగుల సంఘం పక్షాన జిల్లా అధ్యక్షులు, గ్రేడ్ 1 లైబ్రరియన్ బీరం వెంకట రమణ మరియు సంఘం కార్యవర్గం మొత్తం హృదయపూర్వక అభినందనలు/ శుభాకాంక్షలు తెలియజేయడమైనది. ఈ క్రమంలో వారు సంతోషం వ్యక్తపరిచారు.

**-గుడివాడ,జనవరి 20 (వార్తాప్రభ) :**

# గుడివాడ డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వి. ధీరజ్ వినీల్



**గుడివాడ,జనవరి 20 (వార్తాప్రభ) :** గుడివాడ సబ్ డివిజన్ నూతన డిఎస్పీగా వి. ధీరజ్ వినీల్ సోమవారం మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టారు. స్థానిక రాజేంద్రనగర్ లోని డీఎస్పీ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టిన ధీరజ్ వినిల్ కు సబ్ డివిజన్ పరిధిలోని సి.ఐ.లు, ఎస్సైలు, మరియు పోలీస్ అధికారులు పుష్పగుచ్చాలు అందిస్తూ స్వాగతం పలికారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188